వాస్తవాలు పలుకు DD9 వార్త
TE TL/26/A2635
తెలుగు దినపత్రిక



## పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయుల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి

- బోధన్ డివిజన్‌లో ప్రైవేట్ విద్యాసంస్థల బంద్ ప్రశాంతం
- ట్రస్మా, బిస్మా ఆధ్వర్యంలో భారీ ర్యాలీ

8




హైదరాబాద్ | సంపుటి : 03 | సంచిక:100 | 22-08-2026 శనివారం | పేజీలు: 08 | వెల 3/-



## రాయదుర్గం భూమికి రూ.264 కోట్ల రికార్డు

ఐటీ కారిడార్‌లో కొత్త గరిష్ఠ ధర
5.25 ఎకరాల స్థలానికి భారీ డిమాండ్
మే రికార్డును తిరగరాసిన తాజా వేలం
నాలెడ్జ్ సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రభావం
ప్రభుత్వానికి భారీగా సమకూరుతున్న ఆదాయం

2



## అంకాపూర్‌లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి :

2

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా, ఎమ్మెల్యే రాకేష్ రెడ్డిలతో కలిసి పనుల పరిశీలన
- డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, 'యంగ్ ఇండియా' పాఠశాల నిర్మాణాలపై క్షేత్రస్థాయి సమీక్ష



## హైదరాబాద్‌లో
# విద్యా కేంద్రం ఏర్పాటుకు ప్రతిపాదన

- తెలంగాణ యువతకు అంతర్జాతీయ అవకాశాలపై దృష్టి
- విద్య, పరిశోధన, నైపుణ్య రంగాల్లో భాగస్వామ్యం
- తెలంగాణ రైజింగ్ సమ్మిట్‌కు ఆక్స్‌ఫర్డ్‌ను ఆహ్వానం

**ఆక్స్‌ఫర్డ్, ఆగస్టు 21:**

హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి విద్యా కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం తెలంగాణలో విద్యా కార్యక్రమాలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఆహ్వానించారు. తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందంతో కలిసి ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించిన ఆయన.. రాష్ట్ర యువతకు ప్రపంచస్థాయి విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి అవకాశాలు అందించేందుకు భాగస్వామ్యంపై ప్రొఫెసర్లతో చర్చించారు.

**హైదరాబాద్‌లో కేంద్రం ఏర్పాటు**

బ్లావాట్‌నిక్ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్ ప్రొఫెసర్ మాయా ట్యూడర్, బేలియోల్ కాలేజీ ప్రొఫెసర్ ఫైసల్ దేవ్జీలతో రేవంత్‌రెడ్డి సమావేశమయ్యారు. తెలంగాణ రైజింగ్ లక్ష్యాలను వివరించిన సీఎం.. ఆక్స్‌ఫర్డ్ ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కార్యక్రమాలు, పరిశోధన సామర్థ్యాలను హైదరాబాద్‌కు తీసుకురావాలని కోరారు. నగరంలో ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులు, ఉద్యోగ నిపుణులకు

మిగతా 2వ పేజీలో..



## ఆక్స్‌ఫర్డ్‌లో రేవంత్ బృందం చర్చలు

- బ్లావత్నిక్ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్ సందర్శన
- గుడ్ గవర్నెన్స్‌పై విస్తృత చర్చలు
- ప్రజా విధానాల రూపకల్పనపై సమాలోచనలు
- నైపుణ్యాభివృద్ధికి సహకారంపై దృష్టి
- తెలంగాణ యువతకు ప్రపంచస్థాయి శిక్షణ లక్ష్యం

2

## సీఎం రేవంత్ అమెరికా పర్యటన రద్దు

- విదేశాంగ మంత్రిత్వ శాఖ అనుమతి నిరాకరణ నేపథ్యంలో
- కొనసాగుతున్న యూకే పర్యటన

2



## అధికారుల నిర్లక్ష్యంపై పొంగులేటి ఆగ్రహం

- ఎల్లారెడ్డిపేట తహసీల్దార్ సస్పెన్షన్
- రాయికల్ తహసీల్దార్‌కు షోకాజ్ నోటీసు
- ఇందిరమ్మ ఇళ్ల బకాయిలు పూర్తిగా చెల్లింపు
- ఇళ్ల కేటాయింపులో రాజకీయ సిఫార్సులకు చోటులేదు
- భూ భారతి వ్యవహారంపై సిట్ దర్యాప్తు

2

## రాయదుర్గం భూముల వేలానికి తొలగిన అడ్డంకి

- కేసులో జోక్యం చేసుకునేందుకు సుప్రీం కోర్టు నిరాకరణ
- హైకోర్టులోనే తేల్చుకోవాలని పిటిషనర్‌కు సూచన

2



EAGLE FORCE
ELITE ACTION GROUP FOR DRUG LAW ENFORCEMENT

## ఆల్ప్రాజోలం ముఠాపై ఈగల్ ఫోర్స్ ఉక్కుపాదం

- మూడు రాష్ట్రాలకు విస్తరించిన డ్రగ్ నెట్‌వర్క్ ఛేదన
- 15 మంది కీలక నిందితుల అరెస్టు
- రూ.6 కోట్ల ఆస్తుల జప్తు ప్రక్రియ
- 32.5 కిలోల ఆల్ప్రాజోలం స్వాధీనం
- సతారాలో అక్రమ తయారీ కేంద్రం గుర్తింపు
- ఎన్‌డీపీఎస్ చట్టం కింద చర్యలు

**బోధన్, ఆగస్టు 21:**

తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు విస్తరించిన ఆల్ప్రాజోలం అక్రమ రవాణా నెట్‌వర్క్‌పై ఈగల్ ఫోర్స్, బోధన్ పోలీసులు సంయుక్తంగా భారీ ఆపరేషన్ చేపట్టారు. కల్తీకల్లు

మిగతా 3వ పేజీలో..



## అధికంగా తీసుకున్న ఫీజులు వాపస్ చేయాలి

2

- బీజేపీ అధ్యక్షుడికి 'నీట్' విద్యార్థుల తల్లిదండ్రుల వినతి

## నటి షావుకారు జానకి కన్నుమూత

- షావుకారు సినిమాతో ఆ పేరు స్థిరపడిపోయింది



ప్రముఖ సీనియర్ నటి షావుకారు జానకి(94) శుక్రవారం చెన్నైలో కన్నుమూశారు. వయోభారంతోపాటు శ్వాసకోశ సంబంధిత అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమెను కుటుంబ సభ్యులు ఇటీవల చెన్నైలోని కావేరి హాస్పిటల్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో తుది శ్వాస విడిచారు. షావుకారు జానకి మరణంపై నడిగర్ సంఘం అధ్యక్షుడు నాజర్ అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఆమె మరణ వార్తతో తెలుగు, తమిళ, కన్నడ సినీ పరిశ్రమల్లో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. తేనామ్‌పేట్‌లోని సెనోటాఫ్ రోడ్‌లో అభిమానులు, స్నేహితులు, చిత్ర పరిశ్రమకు చెందిన వారు నివాళులర్పించేందుకు ఉంచుతామని తెలిపారు.

**చెన్నై, ఆగస్టు 21 :**



## కొడవలితో హత్య.. రంపంతో ఆత్మహత్యగా చిత్రీకరణ..!

- తమ్ముడిని హతమార్చి.. ఆత్మహత్యగా చిత్రీకరణ

6

## సీఎం రేవంత్ అమెరికా పర్యటన రద్దు

**హైదరాబాద్, ఆగస్టు 21 :**
ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం అమెరికా పర్యటన రద్దయింది. ఈ ప్రతినిధి బృందం యూకే, అమెరికా దేశాల పర్యటనకు వెళ్లాల్సి ఉండగా రాజకీయ కోణంలో అనుమతి నిరాకరించినట్లు కేంద్రం తెలియజేసిన నేపథ్యంలో రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనను రద్దు చేసుకున్నారు. విధివిధానాలు, ప్రొటొకాల్ ప్రకారం ముఖ్యమంత్రి యూకే, అమెరికా పర్యటనకు రాష్ట్రం కేంద్ర అనుమతి కోరింది. తొలుత యూకే పర్యటనకు మాత్రమే అనుమతి లభించింది. అధికారిక ప్రతినిధి బృందం యూకేకు చేరుకున్న తర్వాత అమెరికా పర్యటనకు అనుమతి ఇవ్వడం లేదని కేంద్రం రాష్ట్రానికి తెలియజేసింది. తెలంగాణ అభివృద్ధి, విద్యారంగ పురోగతికి, అలాగే వికసిత్ భారత్ నిర్మాణానికి తోడ్పడే ఈ పర్యటనకు 'రాజకీయ కారణాలతో అనుమతి నిరాకరించడం' పట్ల ముఖ్యమంత్రి తీవ్ర విస్మయం వ్యక్తం చేశారు. అయినప్పటికీ కేంద్ర నిర్ణయాన్ని గౌరవిస్తూ లండన్ నుంచి హైదరాబాద్‌కు తిరిగి రావాలని నిర్ణయించుకున్నారు. కేంద్ర నిర్ణయంపై ముఖ్యమంత్రి స్పందిస్తూ ఈ పర్యటన ఉద్దేశం ఒక్కటే. కేంద్రం తీసుకొచ్చిన నూతన విద్యా విధానంలో భాగంగా ప్రపంచంలోని ప్రఖ్యాత విద్యా సంస్థలను భారత్‌కు, తెలంగాణకు, హైదరాబాద్‌కు తీసుకురావడం. అత్యుత్తమ ఐవీ లీగ్ విశ్వవిద్యాలయాలను, ప్రపంచంలోని అగ్రశ్రేణి విద్యాసంస్థల నుంచి విద్య, నైపుణ్యాలు, శిక్షణ పొందాలన్న మన యువత ఆకాంక్షలకు ఇవి సమాధానంగా నిలిచేవి అని పేర్కొన్నారు. దేశ నిర్మాణం, యువత భవిష్యత్తు విషయానికి వస్తే అందరూ రాజకీయాలు, ఎన్నికలకు అతీతంగా ఆలోచించాలని తాను ఎప్పుడూ విశ్వసిస్తానని వ్యాఖ్యానించారు. వివిధ విశ్వవిద్యాలయాలతో ఇప్పటికే సంప్రదింపులు జరిపిన నేపథ్యంలో అమెరికా పర్యటనకు సంబంధించిన కార్యక్రమాలను అధికారుల బృందం కొనసాగించాలని, ఆయా విశ్వవిద్యాలయాలతో అవసరమైన అవగాహన ఒప్పందాలు (ఎంవోయూ), భాగస్వామ్య ఒప్పందాలను పూర్తి చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. 'హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దుతాం.. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి హెచ్‌సీయూ, జేఎన్‌టీయూ తదితర విశ్వవిద్యాలయాల ఏర్పాటు హైదరాబాద్‌ను అత్యుత్తమ మానవ వనరుల కేంద్రంగా మార్చింది. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్.. ఒక పాఠశాల ప్రపంచానికి నాయకత్వం వహించగలమని నిరూపించింది. అక్కడి నుంచి ప్రపంచంలోని గొప్ప టెక్ నాయకుల్లో కొందరు రూపుదిద్దుకున్నారు. ఐఐటీ, ఐఎస్‌బీ, ఐఐఐటీ, నల్సార్ వంటి సంస్థల ఏర్పాటుతో హైదరాబాద్ అగ్రశ్రేణి కార్పొరేషన్లు, వాటి గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లను ఆకర్షించగలిగింది. ఇప్పుడు ప్రపంచంలోని ప్రఖ్యాత విద్య, నైపుణ్య సంస్థలకు హైదరాబాద్‌ను కేంద్రంగా మార్చి 21వ శతాబ్దపు మన ప్రగతి ప్రయాణానికి శక్తినిస్తాం' అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. షెడ్యూల్ ప్రకారం యూకేలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, లండన్ బిజినెస్ స్కూల్, యూనివర్సిటీ ఆఫ్ లండన్ తదితర సంస్థలను సందర్శించి, వాటి ప్రతినిధులతో సమావేశాలు కొనసాగించనున్నారు. యునైటెడ్ కింగ్‌డమ్‌లోని ప్రముఖ క్రీడా సంస్థలు, నైపుణ్యాభివృద్ధి రంగ నాయకులతో సమావేశమై తెలంగాణతో భాగస్వామ్యాలను అధికారికంగా ఖరారు చేసేందుకు ఈ పర్యటనలో ప్రయత్నిస్తారు. 'హైదరాబాద్‌ను ప్రపంచంలోని అగ్రశ్రేణి నగరాల్లో ఒకటిగా తీర్చిదిద్దాలన్నది నా సంకల్పం., ప్రయత్నం. ఒక సాధారణ భారతీయుడు హైదరాబాద్‌లోనే హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్ లేదా ఎంఐటీ, ఎల్‌బీఎస్, ఎలఎసఈ వంటి ప్రపంచస్థాయి సంస్థల నుంచి విద్య, సర్టిఫికేషన్ పొందగలగాలి. ఎందుకంటే చాలామంది నాయకులు తమ పిల్లలను విదేశాలకు పంపాలని కోరుకున్నారు. కానీ నేను ప్రపంచంలోని అత్యుత్తమ విద్యా సంస్థలను భారత్‌కు తీసుకురావాలని అభిలషిస్తున్నాను' అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు.

## అధికారుల నిర్లక్ష్యంపై పొంగులేటి ఆగ్రహం

**జగిత్యాల, ఆగస్టు 21:**
జగిత్యాల జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖలపై ఉన్నత స్థాయి సమీక్ష జరిగింది. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై మంత్రి పొంగులేటి కఠిన చర్యలు ప్రకటించారు.

**తహసీల్దార్ సస్పెన్షన్**
ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వాన్ని ఎంతమాత్రం సహించబోమని మంత్రి స్పష్టం చేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట తహసీల్దార్ సుజాతను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రాజెక్టులకు సంబంధించిన వివరాలపై సమీక్షలో సరైన సమాధానం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన రాయికల్ తహసీల్దార్‌కు షోకాజ్ నోటీసు జారీ చేయాలని ఆదేశించారు.

**భూ వ్యవహారాలపై కఠిన చర్యలు**
ధరణి పోర్టల్ నిర్వహణలో గతంలో జరిగిన అవకతవకలు, విధుల్లో అలసత్వం చూపే అధికారులపై కఠిన చర్యలు తప్పవని పొంగులేటి హెచ్చరించారు. ఎలాంటి సిఫార్సులను పరిగణనలోకి తీసుకోకుండా తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**ఇందిరమ్మ ఇళ్ల బకాయిలు చెల్లింపు**
ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన బకాయిలను ప్రభుత్వం పూర్తిగా చెల్లిస్తుందని మంత్రి తెలిపారు. ఇళ్ల కేటాయింపు ప్రక్రియలో రాజకీయ సిఫార్సులకు అవకాశం లేదని స్పష్టం చేశారు. ఇప్పటికే రెండు విడతల్లో 8 లక్షల ఇళ్లను లబ్ధిదారులకు అందించామని, ఆర్థిక పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు.

**భూ భారతి ద్వారా సమస్యలకు పరిష్కారం**
గత ప్రభుత్వ హయాంలో ధరణి వ్యవస్థ కారణంగా ప్రజలు ఎదుర్కొన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు భూ భారతి విధానాన్ని తీసుకొచ్చామని పొంగులేటి తెలిపారు. భూ భారతి అమలును అడ్డుకునేందుకు గత పాలకులు ప్రయత్నించారనే ఆరోపణలపై ప్రత్యేక దర్యాప్తు కోసం సిట్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

## రాయదుర్గం భూముల వేలానికి తొలగిన అడ్డంకి

**న్యూఢిల్లీ, ఆగస్టు 21 :**
రాయదుర్గం పాన్‌మక్తా భూముల వేలం ప్రక్రియలో సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. టీజీఐఐసీ నిర్వహిస్తున్న భూముల వేలంపై జోక్యం చేసుకునేందుకు సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. వేలం ప్రక్రియను సవాలు చేస్తూ జువ్వాడి ప్రణయ్ సింహారావు దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఏదైనా అభ్యంతరం ఉంటే హైకోర్టులోనే పరిష్కరించుకోవాలని సీజేఐ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ ధర్మాసనంలో జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ మోహన్ ఉన్నారు. దీంతో రాయదుర్గం పాన్‌మక్తా భూముల వేలం కొనసాగించేందుకు టీజీఐఐసీకి న్యాయపరమైన అడ్డంకులు తొలగినట్లయ్యాయి. పాన్‌మక్తా ప్రాంతంలోని రెండు సర్వే నంబర్లలో సుమారు 11 ఎకరాల భూముల విక్రయానికి టీజీఐఐసీ నోటిఫికేషన్ జారీ చేసింది. ఎకరాకు రూ.175 కోట్లను కనీస ధరగా నిర్ణయించింది. ఈ వేలాన్ని సవాలు చేస్తూ ప్రణయ్ సింహారావు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గతంలో కంచ గచ్చిబౌలి భూములపై సుప్రీంకోర్టు స్టే ఇచ్చిందని, రక్షించాల్సిన భూములనే ఇప్పుడు వేలం వేస్తున్నారని పిటిషనర్ తరఫు న్యాయవాది నీరజ్ కిషన్ కౌల్ వాదించారు. అయితే పిటిషనర్ కోర్టును తప్పుదారి పట్టిస్తున్నారని రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదించారు. కంచ గచ్చిబౌలి భూములకు, ప్రస్తుతం వేలం వేయనున్న భూములకు ఎలాంటి సంబంధం లేదని, అవి సుమారు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్నాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం టీజీఐఐసీ నోటిఫికేషన్‌లో జోక్యం చేసుకోబోమని స్పష్టం చేసింది. అంతేకాదు తదుపరి పిటిషన్‌పై విచారణకు నిరాకరించింది.





## ఆక్స్‌ఫర్డ్‌కు రేవంత్ ఆహ్వానం

**మొదటిపేజీ తరువాయి**
అంతర్జాతీయ స్థాయి అవకాశాలు కల్పించాలని ఆహ్వానించారు.

**భాగస్వామ్యానికి సానుకూల స్పందన**
విదేశీ విశ్వవిద్యాలయాలకు జాతీయ విద్యా విధానం కింద ఉన్న అవకాశాలను సీఎం కార్యాలయ సలహాదారు, ఎక్స్‌అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు వివరించారు. తెలంగాణతో విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో కలిసి పనిచేసేందుకు ప్రొఫెసర్లు మాయా ట్యూడర్, ఫైసల్ దేవ్జీ సానుకూలంగా స్పందించారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు ఆక్స్‌ఫర్డ్ ప్రతినిధులను రావాలని తెలంగాణ బృందం ఆహ్వానించింది.

**సోమర్‌విల్ కాలేజీలో ఇందిరా గాంధీ చిత్రపటం**
ఆక్స్‌ఫర్డ్ పర్యటనలో భాగంగా రేవంత్‌రెడ్డి చారిత్రక సోమర్‌విల్ కాలేజీని సందర్శించారు. అక్కడ విద్యాభ్యాసం చేసిన మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటాన్ని సందర్శించారు. 2002లో సోనియాగాంధీ ఈ చిత్రపటాన్ని కాలేజీకి బహూకరించారు.

**క్రీడా రంగంలో పెట్టుబడులకు పిలుపు**
అనంతరం జీఎంఆర్ గ్రూప్ నిర్వహిస్తున్న యుటిలిటా బౌల్‌ను సీఎం సందర్శించారు. సంస్థ కార్పొరేట్ చైర్మన్ కిరణ్‌కుమార్ గ్రంథితో కలిసి అక్కడి క్రీడా సదుపాయాలను పరిశీలించారు. తెలంగాణలో ప్రపంచస్థాయి క్రీడా మౌలిక వసతుల అభివృద్ధికి పెట్టుబడులు పెట్టి భాగస్వాములు కావాలని జీఎంఆర్ ప్రతినిధులను కోరారు. యూకే పర్యటనలో భాగంగా ఎమిరేట్స్ స్టేడియంలో ఆర్సెనల్, కోవెంట్రీ మధ్య జరిగే మ్యాచ్‌ను కూడా సీఎం వీక్షించనున్నారు.

## ఆక్స్‌ఫర్డ్‌లో రేవంత్ బృందం చర్చలు

**లండన్, ఆగస్టు 21:**
యూకే పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ఉన్నతస్థాయి ప్రతినిధి బృందం ప్రపంచ ప్రఖ్యాత ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయాన్ని సందర్శించింది. విశ్వవిద్యాలయంలోని బ్లావత్నిక్ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌లో ఆక్స్‌ఫర్డ్ అధ్యాపక ప్రతినిధులతో సమావేశమైన బృందం తెలంగాణలో పరిపాలన, ప్రజా విధానాలు, సంక్షేమ కార్యక్రమాల అమలుపై విస్తృతంగా చర్చించింది.

**ఘన స్వాగతం**
ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లు మాయా ట్యూడర్, ఫైజల్ దేవ్‌జీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు, ఇతర ఉన్నతాధికారులకు స్వాగతం పలికారు. అనంతరం తెలంగాణ ప్రతినిధి బృందంతో విశ్వవిద్యాలయ అధ్యాపకులు సమావేశమయ్యారు.

**గుడ్ గవర్నెన్స్‌పై చర్చ**
సమావేశంలో ఉత్తమ పరిపాలనా విధానాలు, ప్రజా విధానాల రూపకల్పనపై ప్రధానంగా చర్చించారు. ప్రభుత్వ సేవలను మరింత సమర్థవంతంగా ప్రజలకు అందించడం, సంక్షేమ కార్యక్రమాలను మెరుగ్గా అమలు చేయడం వంటి అంశాలపై అనుభవాల మార్పిడికి అవకాశాలను పరిశీలించారు.

**నైపుణ్యాభివృద్ధికి భాగస్వామ్యం**
తెలంగాణ యువతకు అంతర్జాతీయ స్థాయి విద్య, నైపుణ్య శిక్షణ అందించేందుకు ఆక్స్‌ఫర్డ్‌తో సహకారం పెంచే అంశంపైనా చర్చలు జరిగాయి. ప్రపంచస్థాయి విద్యా ప్రమాణాలు, ఆధునిక నైపుణ్యాలను రాష్ట్ర విద్యార్థులకు చేరువ చేయడమే లక్ష్యంగా భాగస్వామ్య మార్గాలను అన్వేషిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

**తెలంగాణకు అంతర్జాతీయ విద్యా అనుసంధానం**
విద్య, పరిపాలన, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో ప్రపంచంలోని ప్రముఖ సంస్థలతో తెలంగాణకు అనుసంధానం పెంచే దిశగా పర్యటన కొనసాగుతోంది. ఆక్స్‌ఫర్డ్ వంటి ప్రతిష్ఠాత్మక సంస్థలతో సహకారం రాష్ట్ర యువతకు మరిన్ని అవకాశాలను అందించడంతో పాటు పరిపాలనా వ్యవస్థలోనూ కొత్త విధానాలను ప్రవేశపెట్టేందుకు దోహదపడుతుందని అధికారులు పేర్కొన్నారు.

## ఆల్ప్రాజోలం ముఠాపై ఈగల్ ఫోర్స్ ఉక్కుపాదం

**మొదటిపేజీ తరువాయి**
తయారీలో వినియోగించే ఆల్ప్రాజోలం సరఫరా చేస్తున్న ముఠాకు చెందిన 15 మంది కీలక నిందితులను అరెస్టు చేసి, 32.5 కిలోల ఆల్ప్రాజోలం స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ అక్రమ వ్యాపారం ద్వారా కూడబెట్టినట్లు గుర్తించిన సుమారు రూ.6 కోట్ల మార్కెట్ విలువైన ఆస్తులపై జప్తు చర్యలు ప్రారంభించారు.

EAGLE FORCE
ELITE ACTION GROUP FOR DRUG LAW ENFORCEMENT

**సతారాలో తయారీ కేంద్రం**
బోధన్‌లో జరిగిన దాడుల్లో ఆల్ప్రాజోలం, నగదు, కారు, మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్న పోలీసులు వాటి ఆధారంగా మహారాష్ట్రలోని సతారా జిల్లాకు చేరుకున్నారు. అక్కడి 'సూర్య ప్రభ ఫార్మా కెమ్'పై దాడి చేసి అక్రమంగా తయారు చేస్తున్న 30 కిలోల ఆల్ప్రాజోలంతో పాటు నగదును స్వాధీనం చేసుకున్నారు. సుమారు రూ.4 కోట్ల విలువైన రసాయన ఫ్యాక్టరీని కూడా సీజ్ చేశారు.

**కల్తీకల్లు కేసులతో వెలుగులోకి**
ఉమ్మడి నిజామాబాద్, మెదక్, సిద్దిపేట జిల్లాల్లో కల్తీకల్లులో ఆల్ప్రాజోలం వినియోగిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో దర్యాప్తు ముమ్మరమైంది. నస్రుల్లాబాద్‌లో కల్తీకల్లు తాగి 68 మంది, గాంధారిలో 15 మంది అస్వస్థతకు గురైన ఘటనలు కూడా దందాపై నిఘా పెంచడానికి కారణమయ్యాయి. జహీరాబాద్‌లో 750 గ్రాముల ఆల్ప్రాజోలం, రూ.7.50 లక్షల నగదు, కారును స్వాధీనం చేసుకున్నారు.

**రూ.6 కోట్ల ఆస్తులపై చర్యలు**
డ్రగ్స్ అక్రమ రవాణా ద్వారా సంపాదించినట్లు గుర్తించిన 9.06 ఎకరాల వ్యవసాయ భూమి, 1,370 చదరపు గజాల స్థలాలు, వాహనాలు, రసాయన ఫ్యాక్టరీపై ఎన్‌డీపీఎస్ చట్టంలోని సెక్షన్ 68(ఎఫ్) కింద చర్యలు చేపట్టారు. వీటి ప్రభుత్వ విలువ సుమారు రూ.2.5 కోట్లు కాగా, మార్కెట్ విలువ దాదాపు రూ.6 కోట్లుగా అధికారులు అంచనా వేశారు.

**అక్రమార్జనపై కఠిన చర్యలు**
డ్రగ్స్ వ్యాపారం ద్వారా అక్రమంగా ఆస్తులు కూడబెట్టే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని ఈగల్ ఫోర్స్ అధికారులు స్పష్టం చేశారు. అక్రమ సంపాదనతో కూడబెట్టిన ఆస్తులను గుర్తించి చట్ట ప్రకారం జప్తు చేస్తామని హెచ్చరించారు.


## అధికంగా తీసుకున్న ఫీజులు వాపస్ చేయాలి

**హైదరాబాద్, ఆగస్టు 21 :**
ఎంబీబీఎస్ నాలుగున్నరేళ్ల అకాడమిక్ కోర్సుకు మాత్రమే ట్యూషన్ ఫీజు వసూలు చేయాలని టీఏఎఫ్‌ఆర్‌సీ, ఎన్‌ఎంసీ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా కొన్ని కాలేజీలు ఇంటర్న్‌షిప్ కూడా కలుపుకుని పూర్తి ఐదేళ్లకు ఫీజులు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నాయని నీట్, ఎంబీబీఎస్ విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. ప్రైవేట్ వైద్య కళాశాలల్లో విద్యార్థుల సమస్యలపై వారి తల్లిదండ్రుల ప్రతినిధి బృందం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావుని కలిసి వినతిపత్రం సమర్పించింది. విద్యార్థులను తరగతులకు అనుమతించకపోవడం, బయోమెట్రిక్ హాజరు నమోదు చేయనివ్వకపోవడం, పరీక్షల హాల్ టికెట్లు నిలిపివేయడం వంటి చర్యలకు పాల్పడుతున్నాయని తెలిపారు. కొన్ని కళాశాలలు విద్యార్థులకు చెల్లించాల్సిన స్టైఫండ్‌ను నిలిపివేయడం లేదా చెల్లించిన స్టైఫండ్‌ను తిరిగి తీసుకుంటున్నాయని కూడా ఫిర్యాదు చేశారు. అధికంగా వసూలు చేసిన ఫీజులను తక్షణమే తిరిగి చెల్లించాలని, నిబంధనల ప్రకారం విద్యార్థులకు స్టైఫండ్ అందించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తున్న విద్యా సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రతినిధి బృందం కోరింది. దీనిపై రామచందర్ రావు స్పందిస్తూ బాధిత విద్యార్థులకు బీజేపీ అండగా నిలుస్తుందని, వారి సమస్యలను బలంగా ప్రస్తావిస్తుందని హామీ ఇచ్చారు. టీఏఎఫ్‌ఆర్‌సీ, ఎన్‌ఎంసీ ఆదేశాలను పూర్తిస్థాయిలో అమలు చేసి బాధిత విద్యార్థులకు న్యాయం జరిగే వరకు రాష్ట్ర ప్రభుత్వంపై బీజేపీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.



## రాయదుర్గం భూమికి రూ.264 కోట్ల రికార్డు

**హైదరాబాద్, ఆగస్టు 21:**
హైదరాబాద్ ఐటీ కారిడార్‌లో భూముల ధరలు మరోసారి రికార్డు స్థాయికి చేరాయి. రాయదుర్గంలోని పాన్‌మక్తా పరిధిలో టీజీఐఐసీ నిర్వహించిన తాజా ఈవేలంలో ఎకరం భూమి రూ.264 కోట్లకు అమ్ముడైంది. సర్వే నంబర్ 83/1లోని 5.25 ఎకరాల స్థలానికి జరిగిన ఈ వేలంలో నమోదైన ధర దేశ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లోనే అత్యధికాల్లో ఒకటిగా నిలిచింది.




**పాత రికార్డులకు బ్రేక్**
రాయదుర్గంలో ప్రభుత్వ భూముల వేలం ద్వారా ధరలు వరుసగా పెరుగుతున్నాయి. ఇదే సర్వే నంబర్‌లో మే 2026లో నిర్వహించిన 6.29 ఎకరాల వేలంలో ఎకరం రూ.237 కోట్లు పలికింది. ఆ రికార్డును తాజాగా రూ.264 కోట్ల ధర అధిగమించింది. జూన్‌లో జరిగిన మరో 5.09 ఎకరాల వేలంలో ఎకరానికి రూ.204 కోట్లు లభించాయి. అంతకుముందు 2025 అక్టోబర్‌లో రాయదుర్గంలో జరిగిన వేలంలో ఎకరం రూ.177 కోట్లకు విక్రయమైంది.

**కీలక ప్రాంతాల మధ్యలో..**
రాయదుర్గం చుట్టూ ఉన్న వాణిజ్య ప్రాంతాలు భూముల విలువను గణనీయంగా పెంచుతున్నాయి. మైండ్‌స్పేస్, నాలెడ్జ్ సిటీ, గచ్చిబౌలి, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి ప్రధాన ఐటీ, వ్యాపార కేంద్రాలకు ఈ ప్రాంతం సమీపంలో ఉండటం పెట్టుబడిదారులను ఆకర్షిస్తోంది.

**భారీ నిర్మాణాలకు అనుకూలత**
ఐటీ కారిడార్‌లో పెద్ద విస్తీర్ణంలో ప్రభుత్వ భూములు పరిమితంగా ఉండటం కూడా డిమాండ్ పెరగడానికి కారణంగా మారింది. భవనాల ఎత్తుపై ఉన్న వెసులుబాటుతో బహుళ అంతస్తుల కార్యాలయాలు, వాణిజ్య సముదాయాలు నిర్మించేందుకు సంస్థలు ఆసక్తి చూపుతున్నాయి. దీంతో భూమి కోసం పోటీ పెరిగి వేలం ధరలు కొత్త గరిష్ఠాలను తాకుతున్నాయి.

**ఖజానాకు భారీ ఆదాయం**
రాయదుర్గంలో వరుసగా నిర్వహిస్తున్న భూముల వేలం ప్రభుత్వానికి గణనీయమైన ఆదాయాన్ని తెచ్చిపెడుతోంది. ఐటీ, వాణిజ్య రంగాల విస్తరణతో భవిష్యత్తులో ఈ ప్రాంతంలో భూముల విలువ మరింత పెరిగే అవకాశాలున్నాయనే అంచనాలు రియల్ ఎస్టేట్ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి.

## 48వ డివిజన్‌లో డ్రై డే–ఫ్రైడే

**మురుగు నీటిలో ఆయిల్ బాల్స్.. ఇళ్లలో నిల్వ నీటి తొలగింపు**





**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 21 (డీడీ9 వార్త):**

రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 48వ డివిజన్‌లో శుక్రవారం డ్రై డే–ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా మురుగు నీటిలో ఆయిల్ బాల్స్ వేయడంతో పాటు, ఇళ్ల పరిసరాల్లో చాలా రోజులుగా నిలిచి ఉన్న నీటిని తొలగించారు. దోమల వృద్ధిని అరికట్టి ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు సిబ్బంది తెలిపారు. ప్రతి ఇంటిని పరిశీలించి నిల్వ నీటి ప్రాంతాలను గుర్తించి వాటిని ఖాళీ చేయించారు. కార్యక్రమంలో 48వ డివిజన్ కార్పొరేటర్ రేణుకుంట్ల నిర్మలాదేవి తిరుపతి, శానిటరీ జవాన్ సంపత్, వార్డు ఆఫీసర్ అజయ్, వారియర్స్ టీం మహేందర్, ఆర్పీలు వనజ, ఇంద్రజ తదితరులు పాల్గొన్నారు.

## అక్షర యోధుడు ఓల్లాల

- **ఎందరినో ఆణిముత్యాలుగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయుడు**
- **30 ఏళ్ల విద్యా బోధన అనుభవం**

**ములుగు, ఆగస్టు 21, డీ డీ వార్త :**




ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం గుంటూరు పల్లె గ్రామంలో పనిచేస్తున్న ఉల్లాల రాజేందర్ ఉపాధ్యాయుడు నిబద్ధతకు నిలువుట అద్దంగా నిలుస్తున్నారు. అటు క్రీడల్లో ఇటు విద్యాబోధనలో ముందు ఉంటూ వేలాదిమంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఆయన కాయనే సాటి. 30 ఏళ్ల విద్యా బోధన అనుభవాన్ని రంగరించి విద్యార్థులకు బోధించడంలో పలువురికి ఆదర్శ ప్రాయుడు అవుతున్నాడు. 1998 వ సంవత్సరంలో డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఎంపికైన రాజేందర్ మొట్టమొదటి వెంకటాపూర్ మండలం సుబ్బక్కపల్లి ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా నియమితులయ్యారు ఆ తర్వాత లక్ష్మీదేవి పేట పాఠశాలకు బదిలీపై వచ్చి అక్కడి నుండి కాసిం దేవి పేట పాఠశాలకు ఆ తర్వాత ములుగు మండల ఇంచర్ల యుపిఎస్ పాఠశాలకు బదిలీపై వెళ్ళాడు. ప్రస్తుతం గుంటూరు పల్లి పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తూ విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దుతున్నారు. విద్యార్థి దశ నుండి క్రీడల్లో ప్రతిభ కనబర చడంతో పాటు, సాంస్కృతిక రంగంలో ప్రతిభను కనబరుస్తున్నారు. ఉత్తమ గాయకుడు ఉత్తమ నటుడుగా ఎన్నో అవార్డులు స్వీకరించిన రాజేందర్ ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీ క్రీడల్లో గోల్డ్ మెడల్ అందుకున్నారు. జిల్లాస్థాయి రాష్ట్రస్థాయి జాతీయస్థాయిలో కబడ్డీ క్రీడల్లో రాణించారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూనే విద్యార్థులను ఎంతోమందిని క్రీడాకారులుగా తీర్చిదిద్దారు. ఉపాధ్యాయుల క్రీడల్లో కబడ్డీ యందు ములుగు డివిజన్ స్థాయిలో కబడ్డీ కెప్టెన్ గా ఉండి వెంకటాపూర్ మండలాన్ని మొదటి స్థానం లో నిలిపారు. జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు పరకాల లో జరగదు వెంకటాపూర్ మండలాన్ని కుంటి చేతి పై గెలిపించి ద్వితీయ బహుమతిని చేసుకున్నాడు. వృత్తి నిబద్ధత పట్ల అటు విద్యార్థుల తల్లిదండ్రులు అధికారులు రాజేందర్ ను అభినందిస్తున్నారు. సుమారు 30ఏళ్ల సర్వీసులో ఇలాంటి రీమార్పి లేకుండా విధి నిర్వహణ చేస్తున్న ఓల్లాల రాజేందర్ కు హ్యాట్సాఫ్...

## ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించిన బోధన్ ఆర్ డీఓ



**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 21(డీడీ9 వార్త) :**

బోధన్ మండలం పరిధిలోని బెల్లాల్ తర్ఫా గ్రామంలో 2008లో నిర్మించిన ఇందిరమ్మ ఇండ్ల కాలనీని బోధన్ రెవెన్యూ డివిజినల్ అధికారి విజయ కుమారి శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం, బోధన్ ఎమ్మెల్యే శ్రీ పి.సుదర్శన్ రెడ్డి ఆదేశాల మేరకు హౌసింగ్ బోర్డు పరిధిలోని 186 ఇండ్ల స్థితిగతులను ఆమె క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ ఇండ్ల పునరుద్ధరణ, అవసరమైన మరమ్మత్తుల కొరకు కొటేషన్లు సిద్ధం చేసి తగిన నిధుల బడ్జెట్ నమూనాను తక్షణమే రూపకల్పన చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రేపు జరగనున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటన కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఈ బడ్జెట్ నమూనా అంచనాలను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బోధన్ తహశీల్దార్ విట్టల్, హౌసింగ్ ఏఈఈ, ఇతర రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## జనగామ ప్రధాన రోడ్డుకు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలి

- **మున్సిపల్ కమిషనర్‌కు సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు తొడుపునూరి రమేశ్‌కుమార్ వినతి**

**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 21 (డీడీ9 వార్త):**






రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఆరో డివిజన్ జనగామ ప్రధాన రోడ్డుకు సెంట్రల్ లైటింగ్ సౌకర్యం ఏర్పాటు చేయాలని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు తొడుపునూరి రమేశ్‌కుమార్ కోరారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమేశ్‌కుమార్ మాట్లాడుతూ.. జనగామలో ప్రధాన రహదారి నిర్మించి సుమారు ఎనిమిది నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు లైటింగ్ సౌకర్యం ఏర్పాటు చేయలేదన్నారు. దీంతో రాత్రి వేళల్లో రహదారి పూర్తిగా చీకటిమయంగా మారి ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. చీకటి కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. జనగామలో కాకతీయుల కాలం నాటి త్రిలింగ రాజరాజేశ్వర స్వామి ఆలయం ఉండటంతో నిత్యం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు దర్శనానికి వస్తుంటారని తెలిపారు. ఆలయ ప్రాముఖ్యత దృష్ట్యా భవిష్యత్తులో మరింత మంది భక్తులు, పర్యాటకులు వచ్చే అవకాశం ఉందన్నారు. సాధారణ వీధి దీపాలకు బదులుగా ప్రధాన రోడ్డుకు ఇరువైపులా ఆకర్షణీయమైన సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తే జనగామకు మరింత పర్యాటక శోభ చేకూరుతుందని పేర్కొన్నారు. ప్రజల భద్రతతో పాటు ఆలయ ప్రాంత అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరారు.

## ఆటో కార్మికుల సమస్యలపై ‘చలో కలెక్టరేట్’

**ఆటో ర్యాలీకి నేతృత్వం వహించిన వ్యాల్ల హరీష్‌రెడ్డి**

**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 21 (డీడీ9 వార్త):**




ఆటో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర ఆటో యూనియన్ జేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం ‘చలో కలెక్టరేట్’ కార్యక్రమం నిర్వహించారు. పెద్దపల్లి జిల్లా గౌరవ అధ్యక్షుడు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వ్యాల్ల హరీష్‌రెడ్డి పిలుపు మేరకు గోదావరిఖని చౌరస్తా నుంచి ఆటో ర్యాలీ చేపట్టారు. హరీష్‌రెడ్డి, ఆటో యూనియన్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా హరీష్‌రెడ్డి మాట్లాడుతూ.. 2023 ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు, నెలకు రూ.12 వేల జీవనభృతి, ఆటోనగర్ల ఏర్పాటు తదితర హామీలు ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి అమలుపై దృష్టి సారించలేదని విమర్శించారు. మహాలక్ష్మి పథకం కింద ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో డ్రైవర్లకు గిరాకీ తగ్గి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఆటో కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఈ నెల 24 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక బంద్ చేపడతామని హెచ్చరించారు. అనంతరం హరీష్‌రెడ్డి, మంద రవికుమార్ ఆధ్వర్యంలో ఆటో కార్మికులు పెద్దపల్లి జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఆటో డ్రైవర్ల కుటుంబాలకు నష్టపరిహారం, నెలకు రూ.12 వేల జీవనభృతి, రూ.1,000 కోట్లతో ప్రత్యేక ఆటో కార్పొరేషన్ ఏర్పాటు, ఇన్సూరెన్స్ ప్రీమియం తగ్గింపు, ప్రత్యేక బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అక్రమంగా నడుస్తున్న టూ వీలర్ ట్యాక్సీలను నియంత్రించాలని, రైల్వే స్టేషన్లు, బస్టాండ్ల వద్ద అధికారిక ఆటో పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాలని కోరారు. 50 ఏళ్లు పైబడిన ఆటో డ్రైవర్లకు రూ.10 వేల గౌరవ పెన్షన్, ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల ఆగడాల నియంత్రణ, గ్రేటర్ హైదరాబాద్‌లో ఆటో మీటర్ రేట్ల పెంపు, ఆటోలకు స్టేట్ పర్మిట్, ఇల్లు లేని ఆటో డ్రైవర్లకు స్థలాలు, ఇళ్ల నిర్మాణం, ఆటో కార్మిక రంగాన్ని ప్రత్యేక పరిశ్రమగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జాహిద్ పాషా, పోలాడి శ్రీనివాసరావు, బూరుగు వంశీకృష్ణ, ఆటో జేఏసీ నాయకులు తాండ్ర సదానందం, ఎనగందుల నాంపల్లి, బురహాన్, బండ సురేష్, జబ్బర్, కదార్ల శ్రీధర్, అన్నుబాయ్, బంధారపు కుమార్, బెక్కం శంకర్, మడపెద్ది రమేష్, కాంపల్లి శ్రీనివాస్, చొప్పరి శ్రీనివాస్, రంగు దుర్గాప్రసాద్, కేవీ చందు, అనిల్‌రావు, సార్ల ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి నేస్తం ఎడ్యుకేషనల్ ట్రస్ట్ జిల్లా కన్వీనర్‌గా ఆవుల రాజేష్ యాదవ్

- **విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, యువత సాధికారతకు కృషి**

**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 21 (డీడీ9 వార్త):**



విద్యార్థి నేస్తం ఎడ్యుకేషనల్ ట్రస్ట్ (విఎన్ఈటీ) పెద్దపల్లి జిల్లా కన్వీనర్‌గా ఆవుల రాజేష్ యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు సంస్థ అడ్వైజర్, కన్వీనర్ డా. పి. మురళీ మనోహర్ శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. నూతనంగా నియమితులైన రాజేష్ యాదవ్‌కు పలువురు అభినందనలు తెలిపారు. భారత ప్రభుత్వ గుర్తింపు పొందిన ఛారిటబుల్ ట్రస్ట్‌గా విద్యార్థి నేస్తం ఎడ్యుకేషనల్ ట్రస్ట్ పనిచేస్తోందని, ‘వికసిత్ భారత్ కోసం యువతకు సాధికారత’ లక్ష్యంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వికసిత్ భారత్–2047 నిర్మాణంలో యువతను భాగస్వాములను చేయడంతో పాటు వారిని సాధికారత వైపు నడిపించడమే సంస్థ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లాలో సంస్థను బలోపేతం చేయడంతో పాటు విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, నాయకత్వ వికాసం, యువత సాధికారత కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టేందుకు తనవంతు కృషి చేస్తానని జిల్లా కన్వీనర్ ఆవుల రాజేష్ యాదవ్ తెలిపారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన సంస్థ వ్యవస్థాపక ప్రొఫెసర్ డాక్టర్ విశ్వనాథ్, తెలంగాణ రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ డాక్టర్ గణేష్, సంస్థ అడ్వైజర్, కన్వీనర్ డా. పి. మురళీ మనోహర్‌కు రాజేష్ యాదవ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడిగా వైవీ రావు

- **ప్రధాన కార్యదర్శిగా కడారి సునీల్.. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పూసల రమేష్**

**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 21 (డీడీ9 వార్త):**



ఏఐటీయూసీ పెద్దపల్లి జిల్లా నాలుగో మహాసభల్లో నూతన జిల్లా కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. సుల్తానాబాద్‌లోని యశోద–నరహరి ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం నిర్వహించిన మహాసభల్లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ బాలరాజు నూతన కమిటీని ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా కామ్రేడ్ వైవీ రావు, ప్రధాన కార్యదర్శిగా కామ్రేడ్ కడారి సునీల్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కామ్రేడ్ పూసల రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా కే. రాజారత్నం, జూపాక రామచందర్, సహాయ కార్యదర్శులుగా నాంసాని శంకర్, శనిగరపు చంద్రశేఖర్, నూనేటి రాధమ్మ, కోశాధికారిగా రెడ్డపాక లక్ష్మణ్ ఎన్నికయ్యారు. మొత్తం 35 మంది కౌన్సిల్ సభ్యులు, 17 మంది కార్యవర్గ సభ్యులు, తొమ్మిది మంది ఆఫీస్ బేరర్లతో నూతన జిల్లా కమిటీని ఏర్పాటు చేసినట్లు బాలరాజు తెలిపారు. నూతన కమిటీకి రాష్ట్ర, జిల్లా నాయకులు అభినందనలు తెలిపారు. మరోసారి జిల్లా ప్రధాన కార్యదర్శిగా తనను ఎన్నుకున్నందుకు రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి కడారి సునీల్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం ఐక్యంగా పనిచేస్తామని పేర్కొన్నారు.

## అడవిలో ప్రమాదం.. 108 సిబ్బంది సాహసోపేత సేవలు!

**ఆగస్టు21 డిడి9వార్త వెంకటాపురం.**






వెంకటాపురం మండల కేంద్రంలోని సమీప అటవీ ప్రాంతంలో వంట చెరుకు సేకరించి ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా వాహనం అదుపుతప్పి బెస్తగూడెం గ్రామానికి చెందిన జాడి రాములు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఏమాత్రం ఆలస్యం చేయకుండా అటవీ ప్రాంతంలోకి వెళ్లి క్షతగాత్రుడిని ప్రాణాపాయం నుంచి రక్షించేలా సకాలంలో వైద్యం అందించారు. అంబులెన్స్ అటవీ ప్రాంతంలోకి వెళ్లేందుకు మార్గం లేకపోయినా పైలట్ కుప్పిలి రాధాస్వామి, ఈఎంటి రాజ్యలక్ష్మి సాహసోపేతంగా ముందుకు వెళ్లి, తీవ్రంగా గాయపడిన రాములను అష్టకష్టాలు పడి అంబులెన్స్ వరకు తీసుకొచ్చారు. అనంతరం ప్రాథమిక చికిత్స అందిస్తూ వెంకటాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరీక్షల్లో తొడ భాగంలో ఎముక విరిగినట్లు గుర్తించడంతో మెరుగైన వైద్యం కోసం ములుగు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రమాద స్థలానికి చేరుకోవడం నుంచి ఆసుపత్రికి తరలించే వరకు 108 సిబ్బంది చూపిన సమయస్ఫూర్తి, మానవత్వం, సేవాభావాన్ని గ్రామస్తులు ప్రశంసించారు. అటవీ ప్రాంతంలో మార్గం లేకున్నా ప్రాణం కాపాడేందుకు ముందుకొచ్చిన 108 సిబ్బందికి గ్రామస్తులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

# స్విమ్మింగ్ క్రీడాకారుల ప్రతిభ అభినందనీయం

- **తెలంగాణ మాస్టర్స్ ఛాంపియన్ షిప్ లో ఆర్ జీ-1కు 15 పతకాలు**

**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 21 (డీడీ9 వార్త):**

తెలంగాణ మాస్టర్స్ ఇంటర్ డిస్ట్రిక్ట్ స్విమ్మింగ్ ఛాంపియన్ షిప్ – 2026లో రామగుండం ఏరియా–1కు చెందిన సింగరేణి క్రీడాకారులు 15 పతకాలు సాధించడం అభినందనీయమని ఆర్ జీ–1 ఏరియా జీఎం డి. లలిత్ కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందించారు. హైదరాబాద్ అంబర్ పేటలోని జీహెచ్ ఎంసీ స్విమ్మింగ్ పూల్ లో ఈ నెల 15, 16 తేదీల్లో జరిగిన 11వ తెలంగాణ మాస్టర్స్ ఇంటర్ డిస్ట్రిక్ట్ స్విమ్మింగ్ ఛాంపియ న్ షిప్ – 2 0 2 6 లో ఆర్ జీ–1కు చెందిన క్రీడాకారులు వివిధ విభాగాల్లో పాల్గొని సత్తా చాటారు. రాపర్తి ప్రశాంత్ 100, 200 మీటర్ల ఫ్రీస్టైల్ లో రెండు స్వర్ణాలు, 50 మీటర్ల ఫ్రీస్టైల్ , 50, 100 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్ లో మూడు రజతాలు సాధించారు. ఆర్ . రామారావు బ్యాక్ స్ట్రోక్ లో స్వర్ణం, బ్రెస్ట్ స్ట్రోక్ లో రజతం, మరో రెండు విభాగాల్లో కాంస్య పతకాలు సాధించారు. ఎ. రమేష్ బ్యాక్ స్ట్రోక్ , బటర్ ఫ్లై విభాగాల్లో రెండు స్వర్ణాలు సాధించారు. మాదిరెడ్డి శ్రీధర్ , మంగా వెంకటేశ్వర్లు, బంగారి రాజయ్యలు కూడా వివిధ



విభాగాల్లో పతకాలు సాధించారు. క్రీడాకారులు భవిష్యత్ లో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో మరిన్ని విజయాలు సాధించి సింగరేణి సంస్థకు మంచి పేరు తీసుకురావాలని జీఎం ఆకాంక్షించారు. సింగరేణిలో క్రీడలకు, క్రీడాకారులకు ఎల్లప్పుడూ ప్రోత్సాహం ఉంటుందని తెలిపారు. క్రీడలు ఉద్యోగుల్లో ఆరోగ్యం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొంది స్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ హనుమంతరావు, స్విమ్మింగ్ కోచ్ కృష్ణమూర్తి, క్రీడాకారులు పాల్గొన్నారు.

# అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలి

- **ఎన్డీపీఎస్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలి**
- **అశ్వారావుపేట పోలీస్ స్టేషన్ ను వార్షిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్**

**అశ్వారావుపేట:ఆగస్టు 21(డిడి 9 వార్త)**



వార్షిక తనిఖీలలో భాగంగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ అశ్వారావుపేట పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పాల్వంచ డీఎస్పీ ఆర్. సతీష్ కుమార్ జిల్లా ఎస్పీకి స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది నుంచి జిల్లా ఎస్పీ గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పోలీస్ స్టేషన్లో విధులు నిర్వర్తించే సిబ్బంది ప్రభుత్వ కిట్ ఆర్టికల్స్ ను తనిఖీ చేశారు, పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి, అధికారులకు మరియు సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్‌ను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదగా వ్యవహరిస్తూ, వారి సమస్యలకు సత్వర న్యాయం అందేలా ప్రతి ఒక్కరూ బాధ్యతగా విధులు నిర్వర్తించాలని తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో వివిధ వర్టికల్స్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది పనితీరును ఒక్కొక్కరిగా అడిగి తెలుసుకున్నారు. పేకాట, కోడిపందాలు, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై నిరంతరం నిఘా ఉంచి, కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన దొంగతనం కేసుల వివరాలను అడిగి తెలుసుకొని, పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించడంతో పాటు, దొంగతనాలకు పాల్పడుతున్న నిందితులను గుర్తించి అరెస్ట్ చేయాలని సూచించారు. చోరీకి గురైన ఆస్తి రికవరీపై ప్రత్యేక దృష్టి సారిస్తూ దర్యాప్తును వేగవంతం చేయాలని ఆదేశించారు. మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాకు పాల్పడుతున్న వ్యక్తులను గుర్తించి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా పోలీస్ స్టేషన్ పరిధిలో విస్తృతంగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. సీసీటీఎన్ఎస్ 2.0లో కేసుల నమోదు, దర్యాప్తు వివరాలను ఎప్పటికప్పుడు సక్రమంగా అప్‌డేట్ చేయాలని, ఈ–సాక్ష్య, నాట్ గ్రిడ్, గాండీవ వంటి ఆధునిక సాంకేతిక వ్యవస్థలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు.ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా నిరంతరం సైబర్ అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్ వాహనాలతో నిరంతరం సంచరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, డయల్–112కు ఫోన్ రాగానే సంఘటనా స్థలానికి వేగంగా చేరుకుని బాధితులకు తక్షణ సహాయం అందించాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకుని, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. పర్యావరణం పరిరక్షణలో భాగంగా పోలీస్ స్టేషన్ ఆవరణలో అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ఎస్పి రోహిత్ రాజుని పాలవంచ డిఎస్పి ఆర్ సతీష్ కుమార్ ని శాలువాతో సన్మానించిన వాసవి క్లబ్ జోన్ చైర్మన్ మహాత్మా ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ జల్లిపల్లి దేవ రాజు ఈ కార్యక్రమంలో పాల్వంచ డీఎస్పీ ఆర్. సతీష్ కుమార్, సీఐ నాగరాజు, ఎస్సైలు యయాతి రాజు, రాజేష్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న ఉప్పేడు, వీరాపురం పంచాయతీ పాలకవర్గం..

**ఆగస్టు21 డిడి9 వార్త వెంకటాపురం.**

వెంకటాపురం మండలం ఉప్పేడు వీరాపురం గ్రామపంచాయతీ సిబ్బంది బాడిస సమ్మయ్య (కారోబార్) అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న గ్రామపంచాయతీ పాలకవర్గం, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆయనను పరామర్శించారు. సర్పంచ్ శ్రీమతి మానస రామకృష్ణ, ఉపసర్పంచ్ గుండెల ప్రశాంత్, పంచాయతీ సెక్రటరీ రాజు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కుమ్మరి రామకృష్ణ, వార్డు సభ్యులు గడ్డం వివేక్, జానకీరామ్, శ్రీను, బొల్లె పార్వతి, కాక మానస, తుర్స అనూష, తిరుపతమ్మ, కందుకూరి వెంకటేష్, ఎస్సీ సెల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిట్యాల సాగర్ తదితరులు సమ్మయ్యను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సమ్మయ్య ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని, ధైర్యంగా ఉండాలని సూచించారు. ఆయన కుటుంబానికి అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. అనంతరం గ్రామపంచాయతీ పాలకవర్గం, సిబ్బంది తరపున రూ.10,000 ఆర్థిక సహాయాన్ని



అందజేశారు. అనారోగ్య సమయంలో తమ సిబ్బందికి అండగా నిలిచిన గ్రామ పంచాయతీ పాలకవర్గాన్ని స్థానికులు అభినందించారు.

# జ్వరంవస్తే నిర్లక్ష్యం వద్దు వెంటనే పరీక్షలు చేయించుకోండి..

**మలేరియా నియంత్రణపై సెంట్రల్ టీం పరిశీలన..**

**ఆగస్టు21 డిడి9 వార్త వెంకటాపురం.**

వెంకటాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ వంటి వ్యాధుల నివారణ, నియంత్రణ చర్యలను మలేరియా సెంట్రల్ టీం ప్రతినిధి లక్ష్మణ్, అశోక్, సురేష్ శుక్రవారం పరిశీలించారు. వైద్యాధికారి యుజిస్టర్ గౌడ్‌తో సమావేశమైన అనంతరం ల్యాబ్‌ను తనిఖీ చేసి, రోగుల



పరీక్షలు, రికార్డులు, జ్వరం కేసులపై తీసుకున్న చర్యలను పరిశీలించారు. గ్రామీణ ప్రాంతాల్లో మలేరియా అనుమానిత కేసులను సకాలంలో గుర్తించి రక్త నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించాలని, పాజిటివ్‌గా నిర్ధారణ అయిన వారికి వెంటనే చికిత్స అందించాలని సిబ్బందికి సూచించారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు దోమతెరలు తప్పనిసరిగా వినియోగించాలని, జ్వరం వచ్చిన వెంటనే ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలను సంప్రదించాలని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో SUO నరసింహారావు, HEO కోటిరెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్ గణేష్, హెల్త్ అసిస్టెంట్లు రాఘవులు, భాస్కర్ తదితర CHC వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# మార్కండేయ శివాలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

**ఘనంగా నిర్వహించిన ఉత్సవ కమిటీ**

**పెద్దపల్లి బ్యూరో, ఆగస్టు 21 (డీడీ9 వార్త):**

స్థానిక మార్కండేయ కాలనీలోని మార్కండేయ శివాలయ సన్నిధిలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలను ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మంచికట్ల భిక్షపతి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు చిగురాల రాఘవాచార్యులు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు.

మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సామూహికంగా వరలక్ష్మీ వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు.కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి బండారు రాజమల్లు, కొండి లక్ష్మీపతి, గడ్డం రవి గౌడ్, తోకల మల్లయ్య, లెంకల రాజిరెడ్డి, ఆర్ .ఎస్ . మూర్తి, బోయిన కొమురయ్య, దారా శ్రీనివాస్ , కోలేటి కిషన్ , దిడ్డి ఎల్లయ్య తదితరులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మంచికట్ల భిక్షపతి మాట్లాడుతూ..



సామూహిక వరలక్ష్మీ వ్రతాల్లో పాల్గొన్న మహిళలకు, భక్తులకు వరలక్ష్మీ వ్రత శుభాకాంక్షలు తెలిపారు. వరలక్ష్మీ దేవి అనుగ్రహంతో ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

# పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్ ను కాపాడాలి

- **జీవో నం.97ను వెంటనే నిలిపివేయాలి**
- **తెలంగాణ విద్యార్థి విభాగం భద్రాచలం నియోజకవర్గం అధ్యక్షుడు కీసరి యువరాజు**

**భద్రాచలం, ఆగస్టు 21 డిడి9 వార్త**



కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నం.97ను తక్షణమే నిలిపివేయాలని తెలంగాణ విద్యార్థి విభాగం భద్రాచలం నియోజకవర్గం అధ్యక్షుడు కీసరి యువరాజు డిమాండ్ చేశారు. భద్రాచలంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పాలిటెక్నిక్ విద్యను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేయడం సరికాదని అన్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్ పై అనిశ్చితి నెలకొనే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పాలిటెక్నిక్ విద్య పేద, మధ్యతరగతి విద్యార్థులకు సాంకేతిక విద్యను అందిస్తూ మెరుగైన ఉపాధి అవకాశాలకు బాటలు వేస్తున్న కీలకమైన విద్యా విధానమని పేర్కొన్నారు. అలాంటి వ్యవస్థను హఠాత్తుగా మరో విభాగంలో విలీనం చేయడం వల్ల విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 75 వేల మంది పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్ అగమ్యగోచరంగా మారే పరిస్థితి ఏర్పడిందని యువరాజు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్ ను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం జీవో నం.97పై పునరాలోచించి, వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ప్రయోజనాలకు భంగం కలిగించే నిర్ణయాలను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని కోరారు. పాలిటెక్నిక్ విద్యార్థులకు న్యాయం జరిగే వరకు తెలంగాణ విద్యార్థి విభాగం తరపున పోరాటాన్ని కొనసాగిస్తామని కీసరి యువరాజు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ ఎస్ పార్టీ నాయకులు కీసరి యువరాజు, ఇమంది నాగేశ్వరరావు, రంజిత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్మీ అమ్మవారి కృపతో సిరిసంపదలు

- **శ్రావణ శుక్రవారం భక్తి పారవశ్యం**
- **దేవస్థానం స్థానాచార్యులు కేఈ స్థలశాయి**
- **భద్రాచలం రామాలయంలో సామూహిక కుంకుమార్చనలు**



**భద్రాచలం , ఆగస్టు 21 ( డిడి9 వార్త)**

శ్రావణమాసం సందర్భంగా భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామివారి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీరామ సేవా మండపంలో లక్ష్మీతాయారు అమ్మవారికి శుక్రవారం సామూహిక కుంకుమార్చనను భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో సుందరంగా అలంకరించి ఆసీనులను చేశారు. అనంతరం విశ్వక్సేనార్చన, పుణ్యాహవచనం, పుష్పార్చన, వరలక్ష్మీపూజ, వ్రతకల్పం తదితర పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. సామూహిక కుంకుమార్చనలో మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారికి కుంకుమ సమర్పించి కుటుంబ సభ్యుల ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, సిరిసంపదలు, సౌభాగ్యం కలగాలని ప్రార్థించారు. కుంకుమార్చనతో ఆలయంలో ఆధ్యాత్మిక భక్తి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా దేవస్థానం స్థానాచార్యులు కేఈ స్థలశాయి మాట్లాడుతూ శ్రావణమాసం సందర్భంగా దేవస్థానం ఆధ్వర్యంలో ప్రతి శుక్రవారం లక్ష్మీతాయారు అమ్మవారికి సామూహిక కుంకుమార్చన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

# కంచనపల్లి కాంగ్రెస్ కు షాక్ .. బీఆర్ ఎస్ లోకి పలువురు నేతలు



**జనగామ ఆగష్టు21(డిడి 9వార్త )బ్యూరో**

రఘునాథ్‌పల్లి మండలంలోని కంచనపల్లి గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. తెలంగాణ తొలి ఉప ముఖ్యమంత్రి డాక్టర్ తాటికొండ రాజయ్య సమక్షంలో వారికి బీఆర్ఎస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.కాంగ్రెస్ పార్టీ మాజీ ఉపాధ్యక్షుడు కొనుకటి బిక్షపతి, సీనియర్ నాయకులు కడుదుల రాజు, పెంతల రాజు, కొంకటి హరీష్, కొనుకటి పెద్ద సోమయ్య, కొనుకటి చిన్నస్వామి, సింగిరెడ్డి మల్లయ్య, కడుగుల ఎల్లారెడ్డి, కడుదుల సందీప్, పెనుగొండ చంద్రయ్య తదితరులు బీఆర్ఎస్‌లో చేరిన వారిలో ఉన్నారు.

కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వై.కుమార్‌గౌడ్, మాజీ ఎంపీటీసీలు గవాని నాగేశ్వరరావు, కౌడగాని నానాజీ, పీఏసీఎస్ డైరెక్టర్ కడుదుల విష్ణు, జనగామ జిల్లా మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ మున్సిపట్ల విజయ్, జిల్లా నాయకుడు గూడ కిరణ్, రఘునాథ్‌పల్లి ఉపసర్పంచ్ ద్యావర యాకయ్య, వార్డు సభ్యుడు చింతకింది నరసింహులు,మైలరపు శంబులింగం,లోకుట్ల సృజన్, జోసఫ్, వంగ శ్రీను, ప్యారపు రాములు,నాగులగొని రాములు, గ్రామ పార్టీ కార్యదర్శి కడుదుల రాజు తదితరులు పాల్గొన్నారు.

## భద్రాద్రి దేవస్థానం బహిరంగ వేలంలో భారీగా పెరిగిన లైసెన్సుల ధరలు

- పర్ణశాల ఫోటో లైసెన్సు రూ.28.50 లక్షలకు ఖరారు
- భద్రాచలంలో మొబైల్ లైసెన్స్ కు రూ.22.10 లక్షలకు ఖరారు

**భద్రాచలం, ఆగస్టు 21 (డిడి9 వార్త )**

భద్రాచలం ఈవో కార్యాలయంలో శుక్రవారం పలు దుకాణాలు, లైసెన్సులకు సంబంధించి బహిరంగ వేలం దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. వేలంలో పాత మొత్తాలతో పోలిస్తే పలువాటికి గణనీయంగా అధిక ధరలకు బిడ్లు దాఖలయ్యాయి. ఈ బహిరంగ వేలంలో తాతగూడి షాప్ నంబర్ –1కు గతంలో నెలకు రూ.7,400 ఉండగా, ప్రస్తుతం అత్యధికంగా నెలకు రూ.7,600లకు వి. సత్యబాబు (బీసీఎం) బిడ్ దాఖలు చేశారు. అలాగే పర్ణశాలలో కొబ్బరి చెక్కల లైసెన్స్ కు గత బిడ్ రూ.85 వేలుగా ఉండగా, ప్రస్తుతం అత్యధికంగా రూ.1.16 లక్షలకు ఎం. దుర్గాప్రసాద్ (పర్ణశాల) వేలంపాట దక్కించుకున్నారు. భద్రాచలంలో మొబైల్ లైసెన్స్ కు గతంలో రూ.19.60 లక్షలు ఉండగా, ప్రస్తుతం రూ.22.10 లక్షలకు బి. సదానందం (కరీంనగర్) దక్కించుకున్నారు. పర్ణశాలలో ఫొటో లైసెన్స్ కు గత బిడ్ రూ.23.55 లక్షలు కాగా, ప్రస్తుతం రూ.28.50 లక్షలకు కె. శ్రీనివాస్ (వరంగల్) అత్యధిక బిడ్ వేశారు. పర్ణశాలలో చప్పల్ లైసెన్స్ కు గతంలో రూ.3.90 లక్షల బిడ్ ఉండగా, ప్రస్తుతం రూ.7 లక్షలకు బి. లహరి (పర్ణశాల) అత్యధిక బిడ్ దాఖలు చేశారు.

## రూ.1,400 కోట్ల అభివృద్ధిపై శ్వేతపత్రం ఇవ్వాలి

**జనగామ ఆగష్టు 21(డిడి 9వార్త)బ్యూరో**



స్టేష న్ఘ న్పూర్‌నియోజ క వ ర్గంలో రూ.1,400 కోట్ల అభివృద్ధి పనులు ఎక్కడ జరిగాయో ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రజలకు వివరించాలని బీజేపీ నేత, నియోజకవర్గ ఇన్‌చార్జి పెరుమాండ్ల వెంకటేశ్వర్లు (వెంకన్న) డిమాండ్ చేశారు. అభివృద్ధి పనుల వివరాలతో శ్వేతపత్రం విడుదల చేయాలని కోరారు. నియోజకవర్గంలో పలు సమస్యలు కొనసాగుతున్నాయని, వాటి పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. ప్రజా సమస్యలు పరిష్కారమయ్యే వరకు బీజేపీ తరపున పోరాటం కొనసాగిస్తామని వెంకటేశ్వర్లు తెలిపారు.

## నాగారం ముదిరాజ్ భవనానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి హామీ

**జనగామ ఆగష్టు 21(డిడి 9వార్త)బ్యూరో**

లింగాల ఘన్పూర్ మండల పరిధిలో నాగారం గ్రామంలోని కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన దండు ఉపేందర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో నూతన ముదిరాజ్ భవనం నిర్మించాలని ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన కడియం శ్రీహరి భవన నిర్మాణానికి మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం నాగారం మాజీ సర్పంచ్ బొట్ల భాస్కర్ తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామి ప్రసాదాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యుడు గొల్లపల్లి రమేష్‌గౌడ్, నాగారం కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి గొల్లపల్లి సునీల్‌గౌడ్, మండల యువజన నాయకుడు ఎర్ర క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

## బోధన్ లో భక్తిప్రపత్తులతో గట్టుమైసమ్మ అమ్మవారి వార్షికోత్సవం

### బురుడ్గల్లిలో వైభవంగా పూజలు, అన్నదానం



**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 21(డీడీ9 వార్త) :**

బోధన్ పట్టణంలోని బురుడ్గల్లి కాలనీలో గల శ్రీ గట్టుమైసమ్మ అమ్మవారి ప్రథమ వార్షికోత్సవాన్ని శుక్రవారం భక్తిప్రపత్తులతో నిర్వహించారు. శ్రీ మహేంద్ర మేదరి సంఘం, ఆలయ అభివృద్ధి కమిటీ మరియు కాలనీవాసుల సంయుక్త ఆధ్వర్యంలో ఈ వేడుకలు కన్నులపండువగా సాగాయి. ఉదయం నుంచే కాలనీవాసులు, మహిళలు, బాలబాలికలు సాంప్రదాయ దుస్తుల్లో ఆలయానికి పెద్ద ఎత్తున తరలివచ్చారు. అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, కుంకుమార్చనలు, మంగళహారతులు సమర్పించి నైవేద్యం అందజేశారు. భక్తుల నామస్మరణలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి, పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో మేదరి సంఘం నాయకులు సీదోళ్ళ గంగాధర్, నాగేష్, రమేష్, దండు సాయిలు, చిన్న సాయిలు, మల్లారం ప్రకాష్, శంకర్, కస్ప గంగాధర్, లింగం, గుడుమల చక్రి, సతీష్, బెల్లిడిగ ప్రశాంత్, జొర్రిగల రవికుమార్, ఎడపల్లి సాయిలు, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు మరియు కాలనీవాసులు పాల్గొన్నారు.

## ప్రిన్సిపాల్ రూపారెడ్డి హత్యకు నిరసనగా కొవ్వొత్తులతో నివాళి

**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 21(డీడీ9 వార్త) :**

నల్గొండ జిల్లా నాగార్జున పాఠశాల ప్రిన్సిపాల్ రూపా రెడ్డి దారుణ హత్యను ఖండిస్తూ బోధన్ పట్టణంలోని ప్రభుత్వ గిరిజన బాలుర హాస్టల్ వద్ద ఏబీవీపీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పాఠశాల ప్రిన్సిపాల్‌పై జరిగిన దారుణ హత్యను తీవ్రంగా ఖండిస్తున్నామని, ఈ ఘటనపై పోలీసులు తక్షణమే స్పందించి నిందితులను అరెస్టు చేసి చట్టపరంగా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మహిళలు, ఉపాధ్యాయులకు రక్షణ కల్పించడంలో వైఫల్యాలను నిరసిస్తూ బాధిత కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు సూర్య కుమార్, మనోహర్, ఈశ్వర్, పంచాక్షరి, లక్ష్మణ్, వైభవ్, వసతి గృహ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చేపల చెరువు వ్యాపారి మాయాజాలం

- పేదల భూములు కాజేసి చేపల చెరువులు నిర్వహణ
- భూమికి సమానవిలువ గల భూమి ఇస్తానంటూ మాయ
- పట్టా పొలాలు తీసుకొని పట్టాలేని పొలాలు చూపించిన వైనం.
- 10 సంవత్సరాలు గడుస్తున్న పట్టాలు కాకపోవడంతో లబోదిబోమంటున్న బాధితులు.

**బోనకల్,ఆగస్టు 21, (డీడీ9 వార్త)**

:మండల పరిధిలోని కలకోట గ్రామానికి చెందిన ఇద్దరు రైతులను ఒక చేపల చెరువు చెందిన కాంట్రాక్టర్ నమ్మించి మోసం చేసిన ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే ఆంధ్ర ప్రాంతానికి చెందిన చాపల చెరువు కాంట్రాక్టర్లు రాముడు,అతని మామ మాధవరావు లు కలకోట గ్రామంలో చేపలు పెంచుకునేందుకు కొన్ని ఎకరాల వ్యవసాయ భూమి కొనుగోలు చేసే క్రమంలో గుండ్ల పాండు 1.25ఎకరం,గుంట,గుండ్ల కోటయ్య 1.00 పట్టా భూములను కూడా తమకు అమ్మాలని చెప్పగా వారు మాకు జీవనాధారంగా ఉన్న భూమిని మేము అమ్మమని చెప్పడం జరిగినది. ఈ క్రమంలో మీకు ఈ భూమికి సమానమైన భూమిని మరొకచోట ఇప్పిస్తానంటూ వారిని నమ్మబలికి వారి వద్ద నుండి పట్టా భూమిని కాజేసి వారికి ఎటువంటి ఆధారం లేని లేని భూమిని చూపించి మీకు ఈ భూమిని పట్టాలో ఎక్కేలాగా నేను చేస్తానంటూ నమ్మబలికాడు.ఇది జరిగి సుమారు పది సంవత్సరాలు గడుస్తున్న తమ భూమి రికార్డులో ఎక్కకపోవడంతో బాధితులు



లబోదిబోమంటున్నారు.ఆ భూమిని ఇచ్చిన రైతులు చనిపోగా వారి వారసులు మా భూమి మాకు రిజిస్ట్రేషన్ చేసి అందించాలని సదరు కాంట్రాక్టర్ ను అడగగా ఈ విషయంలో నేను ఏమి చేయలేను అంటూ మాట్లాడటంతో బాధితులు తమ మోసం పోయామని గ్రహించారు.తమకు రికార్డులు లేని భూమి వలన ప్రభుత్వం నుండి వచ్చే పథకాలకు తమ అర్హులుగా లేవని తమను మోసం చేసిన చేపల కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలంటూ బాధితులు వేడుకుంటున్నారు.

**చేపల వ్యాపారి ఇష్టారాజ్యం....**

ఇదిలా ఉండగా సదరు చేపల వ్యాపారి నిబంధనలకు విరుద్ధంగా చేపల చెరువులను నడుపుతున్నారని, వాటికి ఉండవలసిన అనుమతులు లేకుండా నడపడంతో పాటు,అనుమతి లేకుండా పెద్దపెద్ద విద్యుత్ మోటార్లను అమర్చి,వైరా నది నీటిని వాడుతూ,చెరువులోని వ్యర్థాలను క్రింది చెరువులకు వదులుతున్నట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు,సదరు చేపల కాంట్రాక్టర్ పై శాఖ పరిమైన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుకుంటున్నారు.

## జర్నలిస్ట్ సత్యానందం కుటుంబానికి ఆర్థిక చేయూత

- పిల్లల భవిష్యత్తు కోసం రూ.4.50 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్
- కుటుంబసభ్యులకు బాండ్లను అందజేసిన మాదినేని, వల్లంకొండ,సర్పంచ్,ఉప సర్పంచ్

**బోనకల్,ఆగస్టు 21,(డీడీ9 వార్త):**



బోనకల్ మండలం గోవిందాపురం గ్రామానికి చెందిన రిపోర్టర్ మంద సత్యానందం ఇటీవల రోడ్ ప్రమాదంలో మరణించిన సంగతి తెలిసిందే,ఈ నేపథ్యంలో వారి కుటుంబానికి యూటీఎఫ్ జిల్లా నాయకుడు వల్లంకొండ రాంబాబు ఆధ్వర్యంలో "సత్యానందం కుటుంబానికి ఆర్థిక చేయూత" అని మిత్రులందరితో గ్రూప్ ఏర్పాటు చేసి వారి కుటుంబానికి, ముగ్గురు పిల్లలకు ఆర్థిక సహాయం చేయాలని పిలుపునిస్తే స్పందించి సుమారు 200 మంది రూ.4,52,000 సేకరించారు.ఈ సందర్భంగా శుక్రవారం లక్ష్మీపురం సొసైటీలో వారి పిల్లల పేరు మీద ఫిక్స్డ్ డిపాజిట్ చేసి ఆ బాండ్లను కుటుంబసభ్యులకు సొసైటీ చైర్మన్ మాదినేని వీరభద్రరావు,సర్పంచ్ మంద కరుణ,ఉప సర్పంచ్ కారంగుల చంద్రయ్య,యూటీఎఫ్ జిల్లా కోశాధికారి వల్లంకొండ రాంబాబు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..దాతలు అందించిన ఆర్థిక సహాయాన్ని పిల్లల భవిష్యత్తుకు ఉపయోగపడే విధంగా ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశాం అని,దాతల నుంచి సేకరించిన సుమారు రూ.4.50 లక్షల మొత్తాన్ని పిల్లల చదువుల నిమిత్తం ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయడం జరిగింది అని పేర్కొన్నారు. రిపోర్టర్ సత్యానందం అకాల మరణంతో ఆయన కుటుంబం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్న నేపథ్యంలో, కుటుంబానికి అండగా నిలిచేందుకు పలువురు దాతలు ముందుకు వచ్చి తమ వంతు ఆర్థిక సహాయాన్ని అందించిన నేపధ్యంలో వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సత్యానందం కుటుంబ పరిస్థితిని అర్థం చేసుకున్న దాతలు మానవతా దృక్పథంతో అందించిన సహాయాన్ని మాత్రమే కాకుండా, ఆయన పిల్లల భవిష్యత్తుకు భరోసాగా ఉండేలా వినియోగించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు.సత్యానందం కుటుంబానికి అండగా నిలిచిన ప్రతి ఒక్క దాతకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కష్టకాలంలో ఒక కుటుంబానికి మిత్రులు అందరూ అండగా నిలవడం మానవత్వానికి నిదర్శనమని పేర్కొన్నారు. సత్యానందం కుటుంబానికి భవిష్యత్తులో కూడా అవసరమైన సహాయ సహకారాలు మా తరుపున అందిస్తామని వారు అన్నారు.సత్యానందం పిల్లల చదువులకు భరోసాగా నిలిచేలా రూ.4.50 లక్షలను ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయడం ద్వారా దాతలు అందించిన ఆర్థిక సహాయానికి ఒక సార్థకమైన ప్రయోజనం కలిగిస్తుంది అని అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు వల్లంకొండ సురేష్,కొమ్ము శ్రీనివాసరావు,ఇరుగు జానేష్,తమ్మారపు ల క్ష్మణ రావు, ప సుపులేటి వెంకటేశ్వర్లు,ఎర్రబోయిన అప్పారావు, నల్లమోతు నాగేశ్వరరావు,ముత్తరపు రవి,మంద జాన్, కల్యాణపు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## యువత వృత్తి నైపుణ్యాలతోనే ఉజ్వల భవిష్యత్తు

- యువతకు ఉపాధి మార్గమే లక్ష్యంగా వైటీసీ శిక్షణ -- ఐటీడీఏ పీవో రాహుల్

**భద్రాచలం , ఆగస్టు 21 ( డిడి9 వార్త)**

నిరుద్యోగ గిరిజన యువతీ యువకులు తమకు ఆసక్తి ఉన్న వృత్తుల్లో శిక్షణ పొందుతూ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, శిక్షణ ద్వారా లభించే అవకాశాలను సద్వినియోగం చేసుకొని సొంతంగా వ్యాపారాలు ఏర్పాటు చేసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ సూచించారు. శుక్రవారం ఐటీడీఏ ప్రాంగణంలోని వైటీసీని పీవో రాహుల్ సందర్శించారు. ఇప్పటివరకు శిక్షణ పొందిన వారిసంఖ్య, ప్రస్తుతం వివిధ కోర్సుల్లో శిక్షణ పొందుతున్న వారు, రాబోయే బ్యాచ్ ల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వివిధ కోర్సుల్లో శిక్షణ పొందుతున్న గిరిజన యువతీ యువకులతో మాట్లాడి వారు నేర్చుకుంటున్న శిక్షణ, ఎదుర్కొంటున్న అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా బ్యూటీ థెరపిస్ట్, సీఆర్ ఎం, డొమెస్టిక్ నాన్ వాయిస్, ఎంబ్రాయిడరీ తదితర కోర్సుల్లో శిక్షణ పొందుతున్న వారితో మాట్లాడుతూ శిక్షణను శ్రద్ధగా నేర్చుకోవాలని సూచించారు. శిక్షణ తీసుకున్న తర్వాత దానిని వృథా చేయకుండా తప్పనిసరిగా ఉపాధి, ఆదాయ మార్గాలకు ఉపయోగించుకోవాలని అన్నారు. సీఆర్ ఎం శిక్షణ పొందిన యువతీ యువకులు శిక్షకులు అందించే సూచనలు, సూత్రాలను పాటించాలని చెప్పారు. వివిధ సంస్థల్లో పనిచేసే సమయంలో కస్టమర్లను మర్యాదపూర్వకంగా పలకరిస్తూ, వారి సమయాన్ని వృథా చేయకుండా అవసరమైన సేవలు అందించాలని సూచించారు. బ్యూటీ థెరపిస్ట్, ఎంబ్రాయిడరీ శిక్షణ పొందిన యువతులు సొంతంగా వ్యాపారాలు ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా



ఎదగాలని, తద్వారా కుటుంబాలకు జీవనోపాధి కల్పించుకోవాలని తెలిపారు. యువతకు వృత్తి శిక్షణతో పాటు బాహ్య ప్రపంచంలో వస్తున్న నూతన సాంకేతికతలు, ఆధునిక పద్ధతులపై అవగాహన కల్పించాలని ఫ్యాకల్టీలను పీవో ఆదేశించారు. ముఖ్యంగా బ్యూటీ థెరపిస్ట్ శిక్షణలో ఆధునిక సాంకేతికతలు, నూతన పద్ధతులను చేర్చాలని సూచించారు. ప్రస్తుతం శిక్షణ పొందుతున్న యువతీ యువకులు తమ తోటి వారికి కూడా ఈ అవకాశాల గురించి తెలియజేసి, వారు సైతం వృత్తి నైపుణ్య శిక్షణ పొందేలా ప్రోత్సహించాలని రాహుల్ కోరారు. ఈ కార్యక్రమంలో జేడీఎం హరికృష్ణ, వైటీసీ మేనేజర్ శ్రీనివాస్, ఫ్యాకల్టీలు అనురాధ, అరుణ, దినకుమార్, రజియా బేగం, రామ్ ప్రకాష్, సంధ్య, జ్యోతి, సమ్మయ్యతో పాటు శిక్షణ పొందుతున్న యువతీ యువకులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడం జరుగుతుంది..

- అంతర్గత రోడ్ల ఏర్పాటుకు కొలతలు వేసి అంచనాలు తయారు చేస్తున్న ప్రజా ప్రతినిధులు

**మణుగూరు.ఆగస్టు 21(డి డి 9వార్త)**



భద్రాద్రి జిల్లా,మణుగూరు మండలం, సమితి సింగారం గ్రామపంచాయతీ పరిధి,1వ వార్డు, వాగు మల్లారం లో ఏర్పాటు చేసిన సమావేశంలో సమితి సింగారం గ్రామపంచాయతీ సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉప సర్పంచ్ గాండ్ల సురేష్, వార్డు సభ్యులు కోలపిన్ని మానస తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతు, సమితి సింగారం గ్రామపంచాయతీని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సహకారంతో అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడం జరుగుతుందని అన్నారు. అభివృద్ధి అంటే పాయం, పాయం అంటే అభివృద్ధి అన్న విధంగా నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుంది అని అన్నారు. ఏజెన్సీలో కోట్లాది రూపాయల విధులతో విద్యాభివృద్ధి కోసం కృషి చేస్తున్న గొప్ప నాయకుడు ఎమ్మెల్యే పాయ వెంకటేశ్వర్లు అని,గ్రామాల్లో ప్రజల మౌలిక సదుపాయాలైన రహదారులు,త్రాగునీరు,విద్య, వైద్యం కోసం లక్షల రూపాయల ఖర్చుతో కార్యక్రమాలను నిర్వహిస్తున్నారని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు AM చారీ,భాగం రవి, బుర్ర సదానంద, త్రివేణి, రాంబాబు, కళ్యాణ్, రమేష్, సదానంద, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# కొత్త బేస్ వర్క్ షాప్‌లో కార్మికులకు ప్లీడర్ క్యాంటీన్ సేవలు అందించాలి..

**ఏరియా టి.బి.జి.కె.యస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి.**

**మణుగూరు.ఆగస్టు 21(డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా,మణుగూరు సింగరేణి ఏరియాలోని ప్రకాశం ఖని ఓపెన్ కాస్ట్–2 కొత్త బేస్ వర్క్ షాప్‌లో సంస్థ, కార్మిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్లీడర్ క్యాంటీన్ ద్వారా కార్మికులకు క్యాంటీన్ సేవలు అందుబాటులోకి తీసుకురావాలని ఏరియా టి.బి.జి.కె.యస్ వైస్ ప్రెసిడెంట్ నాగెల్లి వెంకటేశ్వర్లు కోరారు. శుక్రవారం మొదటి షిఫ్ట్‌లో పాత బేస్ వర్క్ షాప్‌ను ఆయన సందర్శించి, అక్కడ విధులు నిర్వహిస్తున్న కార్మికులను కలిసి వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పాత బేస్ వర్క్ షాప్‌లో ఈ.పి. ఫిట్టర్, ఈ.పి. ఆపరేటర్, యం.వి. డ్రైవర్, ఫిట్టర్, జనరల్ అసిస్టెంట్ తదితర డిజిగ్నేషన్లలో విధులు నిర్వహిస్తున్న 22 మంది కార్మికులను కొత్త బేస్ వర్క్ షాప్‌కు బదిలీ చేస్తూ సంబంధిత అధికారులు ఆదేశాలు జారీ చేశారని కొత్త బేస్ వర్క్ షాప్‌కు తరలించబడుతున్న కార్మికులకు అవసరమైన కనీస సౌకర్యాలను యాజమాన్యం వెంటనే ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.కొత్త బేస్ వర్క్ పేరిట సుమారు 500 కార్మికులు విధులు నిర్వహిస్తారని అందులో సుమారు 300 మందికి పైగా కార్మికులు మొదటి షిఫ్ట్ లో విధులు నిర్వహిస్తారని వారంతా కొత్త బేస్ వర్క్ షాప్ మ్యాన్‌వే దగ్గర మస్టర్ నమోదు చేసుకొని క్యాంటీన్ సేవలు పొందేందుకు చాలా దూరం నడిచి వెళ్లాల్సి వస్తోందని, క్యాంటీన్‌లో సేవలు పొందిన అనంతరం తిరిగి పనుల కేటాయింపు ప్రదేశాలకు చేరుకోవడానికి సుమారు ఒక కిలోమీటరు వరకు నడవాల్సి వస్తోందని దీంతో సంస్థకు చెందిన వందల మంది కార్మికుల విలువైన సమయం వృథా కావడమే కాకుండా, పనుల కేటాయింపునకు సంబంధించిన డిస్ట్రిబ్యూషన్‌కు వారంతా సకాలంలో హాజరు కాలేకపోతున్నారని ఆయన తెలిపారు. ఫలితంగా



సంస్థకు చెందిన విలువైన పని సమయం వృథా కావడంతో పాటు కార్మికులు మానసిక ఆందోళనకు గురయ్యే పరిస్థితి ఏర్పడుతోందని తెలిపారు. ఈ పరిస్థితి సంస్థ ఉత్పత్తి, పనితీరుపై ప్రతికూల ప్రభావం చూపి సంస్థ కు తీవ్ర నష్టం చేకూర్చే అవకాశం ఉన్నందున, కొత్త బేస్ వర్క్ షాప్‌లోనే ప్లీడర్ క్యాంటీన్ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. పాత బేస్ వర్క్ షాప్ నుంచి కొత్త బేస్ వర్క్ షాప్‌కు తరలించబడుతున్న కార్మికులకు తాగునీరు, క్యాంటీన్, విశ్రాంతి, మరుగుదొడ్లు తదితర అవసరమైన కనీస సౌకర్యాలను అదనంగా సమకూర్చాలని ఆయన కోరారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని నాగెల్లి వెంకటేశ్వర్లు తెలిపారు. సంస్థ ప్రగతి కోసం అంకిత భావంతో కష్టపడి పనిచేస్తున్న కార్మికుల సంక్షేమానికి తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం అన్ని వేళలా అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్, రామాచారి, మల్లేష్, హరికృష్ణ, చేతన్, లక్ష్మణ్ రాజు, సతీష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సేవా దృక్పథంతో నే అమ్మ నాన్న చారిటబుల్ ట్రస్ట్

- **రిటైర్డ్ ప్రొఫెసర్ జాడి మురళీధర్**
- **ప్రతిభకు ప్రోత్సాహం.. పాఠశాలలకు చేయూత**
- **'అమ్మనాన్న' చారిటబుల్ ట్రస్ట్ స్ఫూర్తిదాయక వేడుకలు**
- **విద్యార్థుల భవిష్యత్తుకు 'అమ్మనాన్న' అండ**
- **తల్లిదండ్రుల స్మృతికి సేవా కార్యక్రమాల పరంపర**
- **సేవా కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే**

**కరక గూడెం ఆగస్ట్ 21, (డిడి 9 వార్త)**

తల్లిదండ్రులపై ప్రేమ, గౌరవానికి ప్రతీకగా వారి స్మృతిలో సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని పలువురు వక్తలు పేర్కొన్నారు. మండలంలోని శ్రీరంగపురం గ్రామంలో 'అమ్మనాన్న చారిటబుల్ ట్రస్ట్' ఆధ్వర్యంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్టాపనతో పాటు విద్యాభివృద్ధి, సేవా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ట్రస్ట్ మేనేజింగ్ చైర్మన్, ఉస్మానియా యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్లు జాడి నరసింహారావు, జాడి మురళీధర్ మరియు వారి సోదరులు జాడి మాధవరావు జాడి కోటేశ్వరరావు, జాడి రామనాథంల మాతృమూర్తి స్వర్గీయ జాడి లక్ష్మి , తండ్రి స్వర్గీయ జాడి చొక్కయ్యల మొదటి వర్ధంతిని పురస్కరించుకుని శ్రీరంగపురంలోని స్వగృహం వద్ద తల్లిదండ్రుల విగ్రహాలను ప్రతిష్టించారు.తల్లిదండ్రుల జ్ఞాపకాలను చిరస్థాయిగా నిలిపేలా విగ్రహ ప్రతిష్టాపనతో పాటు సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలను చేపట్టడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులను ప్రోత్సహించేందుకు ట్రస్ట్ తీసుకున్న నిర్ణయం పలువురి ప్రశంసలు అందుకుంది. 2025–26 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన కేజీబీవీ కరకగూడెం, భట్టుపల్లి, అనంతారం జెడ్పీహెచ్ఎస్ పాఠశాలల విద్యార్థులతో పాటు చిరుమల్ల ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు రూ.20 వేల చొప్పున ప్రోత్సాహక స్కాలర్‌షిప్‌లను అందజేశారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తూ, ఉన్నత విద్యలో మరింత రాణించాలని నిర్వాహకులు ఆకాంక్షించారు.అంతేకాకుండా పలువురు విద్యార్థులకు పుస్తకాలు,స్టేషనరీ ఉచితంగా పంపిణీ చేశారు.

**పాఠశాలలకు తాగునీటి సౌకర్యానికి ఆర్థిక సాయం..**

విద్యార్థుల చదువుతో పాటు వారి ఆరోగ్యంపై కూడా దృష్టి సారించిన ట్రస్ట్..



పాఠశాలల్లో సురక్షిత తాగునీటి సౌకర్యం కల్పించేందుకు ముందుకొచ్చింది. కరకగూడెం, అనంతారం పాఠశాలలకు తాగునీటి వసతి కోసం చెరో రూ.15 వేల ఆర్థిక సాయాన్ని ప్రకటించింది. పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి సహకరించడం ద్వారా విద్యార్థులకు మెరుగైన వాతావరణం కల్పించాలనే లక్ష్యంతో ట్రస్ట్ సాగుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

**ఉపాధ్యాయులకు ఘన సన్మానం..**

కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులను ట్రస్ట్ ప్రతినిధులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పేర్కొంటూ వారి సేవలను కొనియాడారు. విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం, పాఠశాలలకు అవసరమైన సహకారం అందించడం ద్వారా సమాజాభివృద్ధిలో ట్రస్ట్ తనవంతు పాత్ర పోషిస్తోందని పలువురు అభిప్రాయపడ్డారు.సాయిని ప్రసాద్ నేత అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి పెద్దపల్లి మాజీ ఎంపీ బోర్లకుంట వెంకటేష్ నేత, మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ ముడిమడుగుల శంకర్, భరత్ వాగ్మారే ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వారు అమ్మనాన్న చారిటబుల్ ట్రస్ట్ చేపడుతున్న సామాజిక, విద్యా సేవలను అభినందించారు. తల్లిదండ్రుల స్మృతిలో సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూ మరింత మందికి అండగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామీణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నాగారం ముదిరాజ్ భవనానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి హామీ

లింగాల ఘనపూర్ మండలం నాగారం గ్రామ కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన దండు ఉపేందర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిని మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో నూతన ముదిరాజ్ భవనం నిర్మించాలని ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన కడియం శ్రీహరి భవన నిర్మాణానికి మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం నాగారం మాజీ సర్పంచ్ బోట్ల భాస్కర్ తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామి ప్రసాదాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యుడు గొల్లపల్లి రమేష్‌గౌడ్, నాగారం కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి గొల్లపల్లి సునీల్‌గౌడ్, మండల యువజన నాయకుడు ఎర్ర క్రాంతి తదితరులు పాల్గొన్నారు.



# ములకలపల్లిలో నేను సైతం చేయూత

- **విద్యా యాత్ర మన MLA - మన బడి**
- **ట్రైబల్ రెసిడెన్షియల్ పాఠశాలలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే జారే..**

**అశ్వారావుపేట:ఆగస్టు21(డిడి 9 వార్త)**




అశ్వారావుపేట నియోజకవర్గం, ములకలపల్లి మండల పరిధిలోని కమలాపురం గ్రామంలో నేను సైతం చేయూత కార్యక్రమంలో భాగంగా విద్యా యాత్ర మన ఎమ్మెల్యే – మన బడి అనే నూతన కార్యక్రమాన్ని గౌరవ ఎమ్మెల్యే జారే ఆదినారాయణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదినారాయణ కమలాపురం గ్రామంలోని ట్రైబల్ రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించే దిశగా నూతన బోరువెల్ మరియు అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు అందించే బోధన, తరగతి గదుల నిర్వహణ మరియు మౌలిక వసతులను నిశితంగా పరిశీలించారు. ఈ పర్యటనలో భాగంగా ఎమ్మెల్యే ఆదినారాయణ స్వయంగా విద్యార్థులతో కలిసి కూర్చుని వారికి భోజనం వడ్డించారు,మరియు భోజనం చేశారు,పిల్లలతో ఆప్యాయంగా ముచ్చటించి, వారి భవిష్యత్తు లక్ష్యాల గురించి ఆరా తీస్తూ విద్యాబుద్ధులు నేర్పించి మార్గదర్శనం చేశారు. గిరిజన ప్రాంతాల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని ఎమ్మెల్యే ఆదినారాయణ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ఉపాధ్యాయులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కొడవలితో హత్య.. రంపంతో ఆత్మహత్యగా చిత్రీకరణ..!



- **తమ్ముడిని హతమార్చి.. ఆత్మహత్యగా చిత్రీకరణ**
- **పోలీసుల దర్యాప్తులో బయటపడిన అన్న హత్యకేసు..**

**ఆగస్టు21.డిడి9 వార్త వాజేడు.**

ములుగు జిల్లా వాజేడు మండలం ముత్తారం కాలనీలో చోటుచేసుకున్న అనుమానాస్పద మృతి కేసును పోలీసులు ఛేదించారు. సొంత తమ్ముడు జాడి రాంబాబును హత్య చేసి, ఆత్మహత్య చేసుకున్నట్లు చిత్రీకరించేందుకు ప్రయత్నించిన అతడి అన్న జాడి జానకిరావు (63)ను పోలీసులు అరెస్టు చేశారు.

వాజేడు పోలీస్ స్టేషన్ లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెంకటాపురం సీఐ ముత్యం రమేష్ కేసు వివరాలను వెల్లడించారు. పోలీసుల కథనం ప్రకారం.. రాంబాబు మద్యం సేవించి తరచూ తనను వేధిస్తూ, కొడుతూ బాధించడంతో భరించలేక జానకిరావు హత్యకు పాల్పడినట్లు విచారణలో అంగీకరించాడు. ఈ నెల 15వ తేదీ రాత్రి రాంబాబు మద్యం మత్తులో ఇంట్లో ఒంటరిగా నిద్రిస్తున్న సమయంలో గడ్డి నరికే కొడవలితో అతడి తలపై కొట్టి హతమార్చినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం హత్యకు ఉపయోగించిన ఆయుధాన్ని కడిగి ఇంట్లో పెట్టి, రంపాన్ని తీసుకెళ్లి మృతుడి చేతిలో ఉంచి.. రాంబాబు తన గొంతును తానే కోసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు నమ్మించే ప్రయత్నం చేసినట్లు వెల్లడించారు. ఈ నెల 18న రాంబాబు ఇంటి వద్ద అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్నట్లు సమాచారం అందడంతో వాజేడు ఎస్సై జక్కుల సతీష్ ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం నివేదికలో మృతి హత్యగా నిర్ధారణ కావడంతో దర్యాప్తు ముమ్మరం చేశారు. అనుమానితులను విచారించగా జానకిరావుపై అనుమానం రావడంతో లోతుగా విచారించగా అసలు విషయం వెలుగులోకి వచ్చినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడి నేరాంగీకారం అనంతరం పంచుల సమక్షంలో పంచనామా నిర్వహించి అతడిని అరెస్టు చేశారు. హత్యకు ఉపయోగించిన ఆయుధాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని సీఐ ముత్యం రమేష్ తెలిపారు.

# రూపారెడ్డి మృతికి నిరసనగా ఇచ్చోడలో ప్రైవేట్ పాఠశాలల బంద్




- **అదిలాబాద్ జిల్లా స్వచ్ఛందంగా మూతపడిన ప్రైవేట్ విద్యాసంస్థలు**
- **రూపారెడ్డికి న్యాయం చేయాలని యాజమాన్యాల డిమాండ్**
- **బంద్ విజయవంతమైందని ప్రైవేట్ పాఠశాలల ప్రతినిధుల వెల్లడి**

**ఇచ్చోడ, ఆగస్టు 21DD9 వార్తలు:**

ప్రిన్సిపాల్ రూపారెడ్డి మృతికి నిరసనగా ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండల కేంద్రంలో శుక్రవారం ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు బంద్ పాటించాయి. స్థానికంగా ఉన్న ప్రైవేట్ విద్యాసంస్థలు స్వచ్ఛందంగా మూతపడటంతో బంద్ విజయవంతమైంది. రూపారెడ్డి మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు ఆమెకు న్యాయం జరగాలని డిమాండ్ చేశారు. విద్యారంగానికి సేవలందిస్తున్న ఉపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లకు రక్షణ కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. రూపారెడ్డి మృతికి దారితీసిన పరిస్థితులపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రైవేట్ విద్యాసంస్థల ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఆమె కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. బంద్‌కు సహకరించిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు, సిబ్బందికి సంఘం ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

# వయ్యారి భామ నివారణతోనే అధిక దిగుబడులు

**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 21(డీడీ9 వార్త) :**

సాలూర మండలంలోని ఖాజాపూర్ గ్రామంలో సోయాబీన్ పొలాల్లో వ్యాపించిన వయ్యారి భామ కలుపు నివారణపై జగిత్యాల వ్యవసాయ బి.ఎస్సీ విద్యార్థులు శుక్రవారం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. పొలాల్లో వయ్యారి భామ పెరగడం వల్ల పంటకు లభించాల్సిన పోషకాలు అందక మొక్కల ఎదుగుదల దెబ్బతింటుందని, ఫలితంగా దిగుబడి గణనీయంగా తగ్గుతుందని వివరించారు. ఈ కలుపు మొక్కల వల్ల మనుషులకు చర్మ అలర్జీలు, శ్వాసకోశ సమస్యలు, పశువులకు అనారోగ్యం కలుగుతాయని తెలిపారు. పంట ప్రారంభ దశలోనే కలుపును గుర్తించి తొలగిస్తే నాణ్యమైన దిగుబడి సాధించవచ్చని సూచించారు. అనంతరం విద్యార్థులు, రైతులు కలసి పొలాల్లోని పార్థీనియం కలుపు మొక్కలను పీకి వేశారు. సమయానుకూల కలుపు యాజమాన్యం, పొలాల పరిశుభ్రతపై విద్యార్థులు ఇచ్చిన సూచనలు తమకు ఎంతో ఉపయోగపడతాయని రైతులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు, బి.ఎస్సీ వ్యవసాయ విద్యార్థులు పాల్గొన్నారు.

## సాలూర మండలంలో ఆర్‌డీఓ విస్తృత పర్యటన



**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 21(డీడీ9 వార్త) :**

సాలూర మండలంలో బోధన్ డివిజన్ ఆర్‌డీఓ విజయ కుమారి శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. స్థానిక తహసీల్దార్ అజ్మత్ నవాజ్ తో కలిసి మండలంలో జరుగుతున్న పలు అభివృద్ధి, పాలనాపరమైన కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మండలంలో చేపడుతున్న ఎస్ఐఆర్–2026 నోటీస్ జనరేషన్ ప్రక్రియ తీరును తనిఖీ చేశారు. నూతనంగా నిర్మించనున్న తహసీల్దార్ కార్యాలయ భవన స్థలాన్ని ఆమె సందర్శించారు. వివిధ సర్వే నంబర్లలో ఉన్న మొత్తం 2 ఎకరాల భూమిని క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం మంధర్న గ్రామంలో ఓటరు తండ్రి పేరు సరిపోలకపోవడంతో సదరు ఓటరు కుటుంబ సభ్యునికి స్వయంగా నోటీసు అందజేశారు. సాలూర తహసీల్దార్ సమక్షంలో గ్రామ బీఎల్ఓతో కలిసి ఆన్‌లైన్ ప్రక్రియ తీరును పరిశీలించారు. పర్యటనలో భాగంగా మంధర్న గ్రామంలోని ఇసుక రీచ్ పాయింట్‌ను సందర్శించి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శంకర్, బీఎల్ఓ, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పోచారం హామీ.. విద్యార్థులకు ప్రత్యేక బస్సు



**కామారెడ్డి జిల్లా బ్యూరో, ఆగస్టు 21(డిడి9 వార్త):**

విద్యార్థుల ఇబ్బందులను తెలుసుకున్న వెంటనే స్పందించిన బాన్సువాడ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి ప్రత్యేక బస్సు సర్వీస్‌ను ఏర్పాటు చేయించారు. బాన్సువాడ పరిసర గ్రామాల నుంచి ఎస్ఆర్ఎన్కే డిగ్రీ కళాశాలకు వెళ్లే విద్యార్థుల సౌకర్యార్థం ఈ ప్రత్యేక బస్సును శుక్రవారం బాన్సువాడ బస్టాండ్‌లో ప్రారంభించారు.కొల్లూరు, దామరంచ, రైతునగర్, అన్నారం, చించోలి, కిష్టాపూర్, బీర్కూర్, తిమ్మాపూర్, బొమ్మందేవ్‌పల్లి చౌరస్తా పరిసర గ్రామాల నుంచి విద్యార్థులు కళాశాలకు వెళ్లేందుకు సరైన రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.ఈ క్రమంలో ఈ నెల 7న తిమ్మాపూర్ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి వెళ్తున్న పోచారం శ్రీనివాసరెడ్డిని కిష్టాపూర్, బీర్కూర్ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు కలిసి తమ సమస్యను వివరించారు.విద్యార్థులు సమయానికి కళాశాలకు చేరుకోలేకపోతున్న విషయాన్ని తెలుసుకున్న పోచారం వెంటనే స్పందించి బాన్సువాడ డిపో మేనేజర్ రవికుమార్‌తో ఫోన్‌లో మాట్లాడి ప్రత్యేక బస్సు ఏర్పాటు చేయాలని సూచించారు.దీంతో బాన్సువాడ నుంచి కొల్లూరు, దామరంచ, రైతునగర్, అన్నారం, కిష్టాపూర్, బీర్కూర్, తిమ్మాపూర్, బొమ్మందేవ్‌పల్లి చౌరస్తా మీదుగా ఎస్ఆర్ఎన్కే డిగ్రీ కళాశాల వరకు ప్రత్యేక బస్సు సర్వీస్ అందుబాటులోకి వచ్చింది.బస్సు ప్రారంభించిన అనంతరం పోచారం శ్రీనివాసరెడ్డి విద్యార్థులతో కలిసి స్వయంగా బస్సులో కళాశాల వరకు ప్రయాణించారు.విద్యార్థులకు మరింత సౌకర్యవంతంగా ఉండేలా ప్రత్యేక బస్సును ఉదయం, సాయంత్రం రెండు వేళల్లో నడిపించాలని డిపో మేనేజర్‌కు సూచించారు.ఈ కార్యక్రమంలో బాన్సువాడ డిపో మేనేజర్ రవికుమార్, ఎస్ఆర్ఎన్కే డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్‌తో పాటు బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

తమ సమస్యను తెలుసుకున్న వెంటనే స్పందించి ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించిన పోచారం శ్రీనివాసరెడ్డికి విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

## గ్రామ గ్రామాన వరలక్ష్మి వ్రతాలు. భక్తిశ్రద్ధలతో మహిళల పూజలు

### అదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం

**(డిడి 9 వార్త ) ఆగష్టు 21**



తలమడుగు మండలంలో పలు గ్రామాలలో భక్తిశ్రద్ధలతో మహిళలు. వరలక్ష్మి వ్రతాలు పూజలు చేశారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ.

వరలక్ష్మి వ్రతం అనేది. శ్రావణమాసంలో శుక్లపక్ష శుక్రవారం రోజున ఆచరించే చాలా ముఖ్యమైన వ్రతం అని తెలిపారు. వరాలన్నీ ఇచ్చే లక్ష్మీదేవి కోసం. ఒకే ఒక్క వ్రతంతో. అష్టలక్ష్ముల అనుగ్రహం వస్తుందని అంతేకాకుండా. ఈ వ్రతం చేయడం వల్ల ఎనిమిది రకాల సంపదలు ధనం ధాన్యం ఆయుష్షు ఆరోగ్యం సంతాన కీర్తి విజయ మోక్షం ఎనిమిది రకాల కోసం పూజ చేస్తామని తెలిపారు. పురాణాల ప్రకారం చారుమతి అనే భక్తురాలికి. కలలో లక్ష్మీదేవి కనిపించి శ్రావణ శుక్రవారం నన్ను పూజిస్తే నీ కోరికలని తీరుతాయని చెప్పింది అప్పటినుండి ఈ వ్రతం మొదలైందని తాము కూడా తరతరాలుగా వస్తున్న ఆచారం ప్రకారం భక్తిశ్రద్ధలతో వరలక్ష్మి వ్రతం జరపడం ఆనందంగా ఉంది అని పలువురు మహిళలు పేర్కొన్నారు.

# నాటికలతో సామాజిక మార్పు సాధ్యం

- **విద్య.. సమానత్వం.. సామాజిక న్యాయం ‘సత్యశోధన’తో చైతన్యం**
- **పూలే దంపతుల స్ఫూర్తి.. నేటి తరానికి ఆదర్శం**
- **ఐటీడీఏ పీఓ బి.రాహుల్**

**భద్రాచలం ఆగష్టు 21, ( డిడి9 వార్త )**

: సామాజిక అసమానతలు, కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాడి.. మహిళా విద్యకు బాటలు వేసిన మహనీయులు జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల జీవిత పోరాట గాథను ‘సత్య శోధన’ నాటిక రూపంలో వేదికపై ఆవిష్క రించడం అభినందనీయమని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ అన్నారు. శుక్రవారం అభ్యుదయ అకాడమీ ఆధ్వర్యంలో భద్రాచలంలో నిర్వహిస్తున్న నాటికోత్సవాల్లో భాగంగా ‘సత్యశోధన’ నాటిక ప్రదర్శనకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ శివ నాయక్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బి.రాహుల్ మాట్లాడుతూ.. సమాజంలో నెలకొన్న అసమానతలను తొలగిం చేందుకు జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే దంపతులు చేసిన కృషి నేటి తరానికి స్ఫూర్తిదాయకమన్నారు. వారి జీవిత పోరాటాలను చరిత్ర పుస్తకాల్లో చదవడంతో పాటు నాటికల రూపంలో ప్రజలకు చేరువ చేయడం ద్వారా సామాజిక చైతన్యం మరింత పెరుగు తుందని పేర్కొన్నారు. ముఖ్యంగా యువత, విద్యార్థులు పూలే దంపతుల ఆశయాలను తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో మార్పు తీసుకు రావడానికి విద్య, సమానత్వం, సామాజిక న్యాయం ఎంత ముఖ్యమో వారి జీవితం తెలియజేస్తుందని అన్నారు.

**నాటి స్వాతంత్ర్య పోరాటంలో.. నాటికలదే కీలకపాత్ర**

జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ శివ నాయక్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్య ఉద్యమ కాలం నుంచి ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో రంగస్థల నాటికలు కీలకపాత్ర పోషించాయని అన్నారు. సమాజంలోని సమస్యలను ప్రజలకు సులభంగా అర్థమయ్యే రీతిలో నాటికల ద్వారా ప్రదర్శిస్తే ఆలోచనల్లో మార్పు తీసు కురావచ్చని తెలిపారు. అభ్యుదయ అకాడమీ ఆధ్వర్యంలో సామాజిక చైతన్యాన్ని పెంపొందించే ఇతివృత్తాలతో నాటికలను ప్రదర్శించడం అభినందనీయ మన్నారు. విద్యార్థులు చట్టాలు, న్యాయవ్య వస్థపై కూడా అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రజలకు న్యాయపరమైన అంశాలను సులభంగా అర్థమయ్యేలా నాటికల రూపంలో ప్రదర్శిస్తే మరింత ప్రయోజనం ఉంటుందని అన్నారు. కళారూపాలు వినోదంతో పాటు విజ్ఞానం, సామాజిక అవగాహనకు కూడా వేదికలుగా నిలవాలని ఆకాంక్షించారు.

**అభ్యుదయ అకాడమీ ప్రయత్నం.. అభినందనీయం**

భద్రాచలం సర్పంచ్ పూణెం కృష్ణ మాట్లాడుతూ.. సమాజంలో మార్పు కోసం మహనీయులు చేసిన త్యాగాలను నాటికల రూపంలో ప్రజలకు తెలియజేయడం అభి నందనీయమన్నారు. భద్రాచలం వంటి ప్రాంతంలో సామాజిక చైతన్యాన్ని పెంపొందించే ఇతివృత్తాలతో నాటికలను ప్రదర్శించడం ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. విద్యార్థులు, యువతలో సామాజిక బాధ్యతను పెంచేందుకు ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వ హించాల్సిన అవసరం ఉందన్నారు.

**విద్యార్థులను ఆలోచింపజేసిన.. ‘సత్యశోధన’**

జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే ఎదుర్కొన్న సామాజిక అవరోధాలు, మహిళా విద్య కోసం వారు సాగించిన పోరాటం, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం చేపట్టిన ఉద్యమాన్ని ప్రతిబిం బించేలా ‘సత్యశోధన’ నాటిక సాగింది. పూలే దంపతుల జీవితంలోని కీలక ఘట్టాలను రంగస్థలంపై ఆవిష్కరించిన



తీరు ప్రేక్షకులను ఆకట్టుకుంది. కళాకారుల అభినయం, సంభాషణలు, పాటలు, వేదికా ప్రదర్శన నాటికకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పూర్వకాలపు రంగస్థల ప్రదర్శనను తలపించే విధంగా సాగిన నాటికను విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. పూలే దంపతులు ఎదుర్కొన్న అవరోధాలు, మహిళా విద్య కోసం వారు చేసిన పోరాటం, సామాజిక సమానత్వం కోసం సాగించిన కృషి విద్యార్థుల్లో ఆలోచనలను రేకెత్తించింది.

**కళ ద్వారా.. సామాజిక సందేశం**

నాటికలు కేవలం వినోదానికే పరిమితం కాకుండా సమాజంలో మార్పుకు వేదికలుగా నిలవాల్సిన అవసరాన్ని ‘సత్య శోధన’ ప్రదర్శన చాటిచెప్పింది. పుస్తకాల్లోని చరిత్రను పాత్రలు, సంభాషణలు, సంఘటనల రూపంలో కళ్ల ముందుంచడంతో విద్యార్థులకు అంశాలను మరింత సులభంగా అర్థం చేసుకునే అవకాశం కలిగింది. సామాజిక వివక్షకు వ్యతిరేకంగా పోరాడిన పూలే దంపతుల స్ఫూర్తిని నేటి తరానికి పరిచయం చేయడంలో నాటిక విజయవం తమైందని పలువురు అభిప్రాయపడ్డారు.

**నాటికోత్సవాలకు.. విశేష స్పందన**

అభ్యుదయ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నాటికోత్సవాలకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. సామాజిక సమస్యలు, చారిత్రక అంశాలు, ప్రజల్లో చైతన్యం కలిగించే ఇతివృత్తాలను నాటికలుగా మలచి ప్రద ర్శిస్తుండటంతో విద్యార్థులు, యువతతో పాటు వివిధ వర్గాల ప్రజలు ఆసక్తిగా హాజరవుతున్నారు. కళాకారులను ప్రోత్స హించడంతో పాటు సామాజిక అంశాలపై చర్చకు వేదిక కల్పించడం ఈ నాటికోత్సవాల ప్రత్యేకతగా నిలుస్తోంది.

**కార్యక్రమానికి.. ప్రముఖుల హాజరు**

అభ్యుదయ అకాడమీ రాష్ట్ర నాయకులు కే.దేవేంద్ర అధ్యక్షతన జరిగిన కార్యక్ర మానికి పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ప్రముఖ సినీ దర్శకులు తాండ్ర రమణ, డీసీసీబీ మాజీ చైర్మన్ ఎలమంచి రవికుమార్, బీసీ సంఘం కన్వీనర్ బొలిశెట్టి రంగారావు, విద్యాసంస్థల అధినేత ఎస్.ఎల్.కాం తారావు, కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసి యేషన్ కార్యదర్శి చెల్లగుల్ల నాగేశ్వ రరావు, అభ్యుదయ అకాడమీ సభ్యులు ఎం.బి.నర్సారెడ్డి, అభ్యుదయవాద నాయకులు జి.ఎస్.శంకర్రావు, ప్రజానా ట్యమండలి నాయకులు గడ్డం స్వామి, ఐ.వెంకటేశ్వర్లు, తోకల గౌతమి, నాలుగో వార్డు సభ్యుడు, గ్రామపంచాయతీ ఫ్లోర్ లీడర్ బండారు శరత్‌బాబు, కార్మిక సంఘం నాయకులు ఎర్రంశెట్టి వెంకటరా మారావు, 20వ వార్డు సభ్యురాలు ఇరుప అనసూర్య, ఐద్వా అధ్యక్ష కార్యదర్శులు సీతాలక్ష్మి, జీవనజ్యోతి, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు రవీంద్ర, భూపేంద్ర, సాహితీ స్రవంతి నాయకులు దుర్గాచారి, పూర్ణిమ, ప్రముఖ పాత్రికేయులు సోముల గిరిప్రసాద్, దారిశెట్టి సతీష్‌బాబు, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వరాలిచ్చే వరలక్ష్మి.. భక్తి వైభవం!

- **జిల్లా వ్యాప్తంగా వైభవంగా వరలక్ష్మి వ్రత పూజలు**
- **పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళా భక్తులు**
- **సౌభాగ్యం, కుటుంబ క్షేమం కోసం ప్రత్యేక పూజలు**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా శుక్రవారం వరలక్ష్మీ వ్రతం భక్తిశ్రద్ధలతో వైభవంగా జరిగింది. శ్రావణమాసం రెండో శుక్రవారం సందర్భంగా తెలుగింటి ఆడపడుచులు వేకువజామునే ఇళ్లను శుభ్రం చేసి, రంగవల్లులు తీర్చి, పసుపు, కుంకుమ, పూలతో లక్ష్మీదేవిని అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళసూత్రానికి మహిమ.. మాంగల్యానికి మమకారం.. కుటుంబ సౌభాగ్యం, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, ఐశ్వర్యం కలగాలని ఆకాంక్షిస్తూ మహిళలు భక్తితో వరలక్ష్మీదేవిని కొలిచారు. పట్టణాలు, గ్రామాలు, ఏజెన్సీ ప్రాంతాలు అనే తేడా లేకుండా ఇళ్లతో పాటు ఆలయాల్లోనూ ప్రత్యేక పూజలు నిర్వహించడంతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి**

ఆగష్టు 21 (డిడి9 వార్త) శ్రావణ శుక్రవారం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా వరలక్ష్మి వ్రత వేడుకలు ఘనంగా జరిగాయి. తెల్లవారుజామున నుంచే మహిళలు వ్రతానికి సంబంధించిన ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఇళ్లను శుభ్రం చేసి గడపలకు పసుపు, కుంకుమలు అద్దారు. మామిడి ఆకుల తోరణాలు, పూల అలంకరణలతో ఇళ్లను ముస్తాబు చేశారు. అనంతరం కలశాన్ని ప్రతిష్ఠించి వరలక్ష్మీదేవిని ఆవాహన చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**భక్తిశ్రద్ధలతో.. ప్రత్యేక పూజలు**

వరలక్ష్మి వ్రతంలో భాగంగా మహిళలు అమ్మవారికి పసుపు,



కుంకుమ, పూలు, పండ్లు, కొబ్బరికాయలు, వివిధ రకాల నైవేద్యాలను సమర్పించారు. కుటుంబంలో సుఖశాంతులు నెల కొనాలని, భర్తకు ఆయురారోగ్యాలు కలగాలని, పిల్లలు ఆరోగ్యంగా ఉండాలని, కుటుంబం సిరిసంపదలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. అవివాహిత యువతులు కూడా తమకు మంచి వరుడు లభించాలని, భవిష్యత్ జీవితం సుఖసంతోషాలతో సాగాలని అమ్మవారిని వేడుకున్నారు.

**అష్టలక్ష్మి రూపాల్లో.. ఆరాధన**

వరలక్ష్మి వ్రతం సందర్భంగా మహిళలు లక్ష్మీదేవిని అష్టలక్ష్మి రూపాల్లో స్మరించారు. ఆదిలక్ష్మి, ధాన్యలక్ష్మి, ధైర్యలక్ష్మి, గజలక్ష్మి, సంతానలక్ష్మి, విజయలక్ష్మి, విద్యాలక్ష్మి, ధనలక్ష్మి రూపాలను పూజిస్తూ కుటుంబానికి అవసరమైన అన్ని శుభఫ లితాలు కలగాలని ఆకాంక్షించారు. సంపదతో పాటు ఆరోగ్యం, ధైర్యం, విద్య, సంతానం, విజయం, సుఖసంతోషాలు ప్రసాదించాలని అమ్మవారిని భక్తులు ప్రార్థించారు.

**మహిళా భక్తులతో.. ఆలయాల్లో సందడి**

జిల్లాలోని ప్రధాన ఆలయాల్లోనూ వరలక్ష్మి వ్రతాన్ని పురస్క రించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తగూడెం, పాల్వంచ, భద్రాచలం, మణుగూరు, ఇల్లెందు, సారపాక, బూర్గంపాడు, అశ్వారావుపేట, చర్ల, దుమ్ముగూడెం తదితర ప్రాంతాల్లో మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కొన్ని ప్రాంతాల్లో సామూహికంగా వరలక్ష్మి వ్రతాలు నిర్వహించడంతో ఆలయ ప్రాంగణాలు భక్తులతో సందడిగా మారాయి.

**పూజా సామగ్రి కొనుగోళ్లతో.. మార్కెట్లలో సందడి**

వరలక్ష్మి వ్రతం నేపథ్యంలో జిల్లాలోని పట్టణాలు, గ్రామాల్లో పూజా సామగ్రి విక్రయాలు ఊపందుకున్నాయి. పూలు, పండ్లు, కొబ్బరికాయలు, పసుపు, కుంకుమ, గాజులు, చీరలు, పూజా సామగ్రి తదితర వస్తువుల కొనుగోళ్లతో మార్కెట్లు సందడిగా కనిపించాయి. వ్రతానికి అవసరమైన వస్తువులను కొనుగోలు చేసేందుకు మహిళలు పెద్ద సంఖ్యలో మార్కెట్లకు తరలి వచ్చారు.

**వాయనాలు.. ఆత్మీయతకు ప్రతీక**

వరలక్ష్మి వ్రతంలో భాగంగా మహిళలు ఒకరినొకరు ఇళ్లకు ఆహ్వానించుకుని పసుపు, కుంకుమలు, వాయనాలు ఇచ్చిపు చ్చుకున్నారు. వ్రతకథను వినడంతో పాటు తోరాలను ధరించారు. ఈ సందర్భంగా మహిళల మధ్య ఆత్మీయత వెల్లివి రిసింది. కుటుంబ బంధాలు, స్నేహ సంబంధాలు మరింత బలపడేలా వ్రత వేడుకలు దోహదపడ్డాయి.

**తెలుగింటి సంప్రదాయానికి.. ప్రతిబింబం**

వరలక్ష్మి వ్రతం కేవలం పూజా కార్యక్రమం మాత్రమే కాకుండా తెలుగింటి సంప్రదాయాలు, కుటుంబ విలువలు, మహిళల భక్తిశ్రద్ధలకు ప్రతీకగా నిలుస్తోంది. మారుతున్న జీవ నశైలిలోనూ తరతరాలుగా వస్తున్న ఈ ఆచారాన్ని కొనసాగిస్తూ మహిళలు తమ పిల్లలకు వ్రతం విశిష్టతను వివరిస్తున్నారు. భక్తి, సంప్రదాయం, కుటుంబ అనుబంధాల సమ్మేళనంగా వరలక్ష్మి వ్రత వేడుకలు కొనసాగుతున్నాయి.

**భక్తి పరిమళాలతో.. పండుగ శోభ**

శ్రావణ శుక్రవారం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ప్రతి ఇంటా పసుపు పరిమళం, పూల సోయగం, మంగళహారతుల వెలుగులు, లక్ష్మీదేవి నామస్మరణతో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. మహిళలు భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీదేవిని కొలిచి కుటుంబ క్షేమం, సౌభాగ్యం, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు ప్రసాదించాలని ప్రార్థించారు. వరాల కోసం వ్రతం.. సౌభాగ్యం కోసం సంకల్పం.. కుటుంబ క్షేమం కోసం ప్రార్థన.. ఇదే వరలక్ష్మి వ్రతం విశిష్టతగా నిలిచింది.

# పేదల ఇంట ఇందిరమ్మ వెలుగులు

**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 21(డీడీ9 వార్త) :**

పేద ప్రజల సొంతింటి కలను నెరవేర్చి వారి జీవితాల్లో వెలుగులు నింపడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని పీసీసీ డెలిగేట్ గంగ శంకర్ స్పష్టం చేశారు. బోధన్ మండలం పెగడపల్లి గ్రామానికి చెందిన లబ్ధిదారులు చిన్న మోజీ గంగాధర్ దంపతులకు మంజూరైన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ మహోత్సవం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి పీసీసీ డెలిగేట్ గంగ శంకర్ ముఖ్యఅతిథిగా హాజరై లబ్ధిదారుల కుటుంబ సభ్యుల ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఆశీస్సులతో ఈ ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేయించడం జరిగిందన్నారు.

# పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయుల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి

- బోధన్ డివిజన్ లో ప్రైవేట్ విద్యాసంస్థల బంద్ ప్రశాంతం
- ట్రస్మా, బిస్మా ఆధ్వర్యంలో భారీ ర్యాలీ






**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 21(డీడీ9 వార్త) :**

నల్లగొండ జిల్లాలో ప్రైవేట్ పాఠశాల కరస్పాండెంట్ రూపారెడ్డి దారుణ హత్యకు గురికావడాన్ని నిరసిస్తూ తెలంగాణ గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్యాల సంఘం, బోధన్ పాఠశాలలు మరియు కళాశాలల యాజమాన్య సంఘం పిలుపు మేరకు శుక్రవారం బోధన్ డివిజన్ పరిధిలో ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు స్వచ్ఛందంగా బంద్‌ను పాటించాయి. విద్యాసంస్థలన్నీ మూతపడటంతో బోధన్ పట్టణంతో పాటు డివిజన్ పరిధిలోని పాఠశాలలు, కళాశాలలు బోసిపోయాయి. స్థానిక మహాలక్ష్మి కల్యాణ మండపం వద్ద సమావేశమై రూపారెడ్డికి ఘన నివాళులు అర్పించారు. అక్కడి నుంచి ప్రారంభమైన ఈ నిరసన ప్రదర్శన ర్యాలీ అంబేద్కర్ చౌరస్తా మీదుగా సాగుతూ ఆర్‌డీఓ కార్యాలయం వరకు చేరుకుంది. విద్యా రంగంలో పనిచేస్తున్న వారిపై దాడులు అరికట్టాలని, రూపారెడ్డి హత్యకు బాధ్యులైన నిందితులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కోరుతూ వందలాది మంది ఉపాధ్యాయులు, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్య ప్రతినిధులు ప్లకార్డులు చేతబూని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం ఆర్‌డీఓ విజయ కుమారికి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కొడాలి కిషోర్ మాట్లాడుతూ.. బంద్‌కు సహకరించిన ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలకు, ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలిపారు. సమాజ వికాసానికి, విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణానికి కృషి చేస్తున్న విద్యావేత్తలకు, ఉపాధ్యాయులకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యాసంస్థను సమర్థవంతంగా నిర్వహిస్తూ సమాజానికి సేవలందిస్తున్న ఒక మహిళా కరస్పాండెంట్‌ను దారుణంగా హత్య చేయడం అత్యంత హేయమైన చర్య అని అన్నారు. ఈ ఘటనతో రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులలో తీవ్ర అభద్రతా భావం నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా రంగంలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరి ప్రాణాలకు, వృత్తి పరమైన గౌరవానికి ప్రభుత్వం పూర్తి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. రూపారెడ్డి దారుణ హత్య కేసును అత్యంత ప్రాధాన్య అంశంగా పరిగణించి వేగవంతంగా విచారించాలని, దోషులందరినీ చట్టం ముందు నిలబెట్టి కఠినంగా శిక్షించాలని, పాఠశాల యాజమాన్యాలు, ఉపాధ్యాయులపై జరుగుతున్న వేధింపులు, బెదిరింపులు, దాడులపై తక్షణమే స్పందించేందుకు ప్రతీ జిల్లాలో ఒక ప్రత్యేక పోలీస్ నోడల్ అధికారిని నియమించాలని అన్నారు. జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో ప్రైవేట్ విద్యాసంస్థల భద్రతపై జిల్లా స్థాయి సమీక్షా సమావేశాలు నిర్వహించి, పాఠశాలల వద్ద పోలీస్ పర్యవేక్షణను పెంచేలా స్పష్టమైన భద్రతా మార్గదర్శకాలను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. దారుణ హత్యకు గురైన రూపారెడ్డి కుటుంబానికి ప్రభుత్వం తరపున తక్షణమే తగిన ఆర్థిక సహాయం అందించి, ఆ కుటుంబానికి పూర్తి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యను కాపాడుదాం – విద్యా రంగంలో పనిచేసే ప్రతి ఒక్కరి భద్రతను కాపాడుదాం అనే నినాదంతో హక్కుల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కలసిరావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం స్పందించి తగిన రక్షణ చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# సిరికొండ మండలంలోని గిరిజన గ్రామాలలో పర్యటించిన మాజీ ఎంపీ సోయం. బాపూరావు.



- గిరిజనుల యొక్క సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తాను.
- ప్రభుత్వం యొక్క సంక్షేమ పథకాలు ఏ విధంగా ప్రజలకు చేరుతున్నాయని అడిగి తెలుసుకున్న సోయం బాపూరావు.
- సిరికొండ మండల కేంద్రంలోని అన్ని గ్రామాలు అభివృద్ధిలో ముందుండాలి.
- ఇందిరమ్మ ఇండ్లు ప్రతి లబ్ధిదారునికి చేరాలి.

**సిరికొండ 21 ఆగస్టు (డిడి9 వార్త న్యూస్ ):**

ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలంలోని నేరడిగొండ, చిన్నగోధుమల్లె, పెద్ద గోధుమల్లె, నారాయణపూర్, గ్రామాల్లో మాజీ ఎంపీ మాజీ సోయం. బాపూరావు పర్యటించారు. గ్రామస్థులతో సమావేశాలు నిర్వహించి గ్రామాల్లో ఉన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు.ముందుగా సిరిచేల్మా గ్రామంలో కొలువై ఉన్న పురాతన శివాలయాన్ని దర్శించుకొని అక్కడి నుంచి పర్యటనను ప్రారంభించారు. నేరడిగొండ(జి) నారాయణపూర్ గ్రామ పంచాయితీలలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి రావడానికి రోడ్డు సౌకర్యం సరిగా లేదని దానిని మంజూరు చేసి పూర్తి చేసే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలు తన దృష్టికి తీసుకురాగా పరిష్కరించే విధంగా కృషి చేస్తానన్నారు.గత పాలకులు గ్రామంలో ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కూడా ఇవ్వలేదని, ప్రజా ప్రభుత్వం ఇండ్లు లేని ఆదివాసులకు 100% ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తుందన్నారు. గ్రామానికి ఇప్పటికే ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వడం జరిగిందని ఇంకా తనవంతు కృషిగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేపిస్తానన్నారు. వచ్చే జనవరి మాసం వరకు మరో 20 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసే భాధ్యత తీసుకుంటానన్నారు.10 సం. కాలంలో రేషన్ కార్డులు ఇవ్వకుండా ప్రజలకు తిప్పలు పెట్టిందని కానీ నేడు ప్రజా ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు మంజూరు చేసి సన్న బియ్యాన్ని అందిస్తుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు, ఫ్రీ కరెంటు, రెండు లక్షల రుణ మాఫీ, ఎకరానికి 12 వేల ఆర్థిక సహాయం లాంటి ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి పేదలను ఆదుకుంటుందన్నారు. గ్రామ కమిటీ హాల్ పూర్తి చేస్తామని, అలాగే నీటి సమస్య తీర్చేందుకు 2 బోర్లు వేయించే భాధ్యత తనదే నాన్నారు. అలాగే ప్రజా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రతి లబ్ధిదారుకు ఇవ్వడం జరుగుతుందని మధ్యవర్తులను ఎవరిని నమ్మొద్దని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంలో గ్రంధాలయ చైర్మన్ మల్లెపూల. నరసయ్య,ఇచ్చోడ మార్కెట్ చైర్మన్ కొమరం సత్యవతి కోటేష్,కళ్లెం.నారాయణరెడ్డి, ఇచ్చోడ మండల అధ్యక్షులు, సిరికొండ మండల అధ్యక్షులు కంచ. లక్ష్మణ్,ఇచ్చోడ సర్పంచ్ జల్లె జాకు, సిరికొండ సర్పంచ్ బొడ్డు. దత్తాత్రేయ, జిల్లా వైస్ ప్రెసిడెంట్ ఎస్సీ డిపార్ట్మెంట్ జైపాల్, కొత్తూరు.లక్ష్మణ్ జిల్లా ఎస్సీ డిపార్ట్మెంట్, జనరల్ సెక్రెటరీ, బోత్ నియోజకవర్గం మైనార్టీ చైర్మన్ ముస్తఫా, బోథ్ బ్లాక్ ప్రెసిడెంట్ ప్రపోల్ రెడ్డి, ఏఎంసి వైస్- చైర్మన్ శేషారావు, మేడిగూడ సర్పంచ్ మడవి.భీమ్ రావు, మల్యాల సర్పంచ్ మేస్రం. దేవరావ్, బజారత్నూర్ మండల అధ్యక్షుడు, జంటి, కళ్లెం విట్టల్, నేరడిగొండ జి సర్పంచ్ పెందూర్. గుణవంత్, మునేశ్వర్. కోటేష్, చిక్రం.నాగరావ్, మాజీ సర్పంచ్, ధరంపురి సర్పంచ్ సోయం.విశ్వనాధ్, దుబార్పెట్ సర్పంచ్ విట్టల్. ఇచ్చోడ మైనార్టీ అధ్యక్షుడు అబ్దుల్ రషీద్, ఏఎంసీ డైరెక్టర్ బైరి.లచ్చన్న, ఆత్మ డైరెక్టర్ షేక్ గౌస్, ఎక్స్ ఎంపిటిసి ప్రవీణ్ రెడ్డి, యూత్ అధ్యక్షుడు క్రాంతికుమార్,ex ఎంపిటిసి భీమ్ రెడ్డి, మాజీ సర్పంచ్ రాజు, సల్యాదా సర్పంచ్, తుడసం లక్ష్మణ్, అడిగాం సర్పంచ్ రేస్ పోతారెడ్డి, మాజీ మండల అధ్యక్షులు షేక్. ఇమామ్,చోలే ప్రభాకర్ జనరల్ భజరత్నూర్ మాజీ మండల్ ప్రెసిడెంట్, జెల్ కే పాండురంగ, మాజీ జెడ్పిటిసి రఘురాం సెక్రెటరీ మధుకర్, భూతి లక్ష్మణ్, చంద్రశేఖర్, జగదీశ్వర్, ఇక్బాల్, జహీర్, అబ్దుల్ కరీం, ఆత్రంగంగారాం, పటేల్, మహాజన్, దేవరీ, మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సనాతన ధర్మానికి, భారతీయ సంస్కృతికి ప్రతీక కాషాయ ధ్వజం

- ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ
- ఖిల్లా రామాలయంలో 101 అడుగుల కాషాయ ధర్మ ధ్వజానికి భూమిపూజ



**నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 21(డీడీ9 వార్త) :**

నిజామాబాద్ నగరంలోని ప్రసిద్ధ, చారిత్రాత్మక ఖిల్లా రామాలయ ఆవరణలో ఆధ్యాత్మిక వాతావరణం ఉట్టిపడింది. ఆలయంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేయనున్న 101 అడుగుల శ్రీ కాషాయ ధర్మ ధ్వజ స్థాపనకు శుక్రవారం వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ భూమి పూజ వైభవంగా జరిగింది. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి నిజామాబాద్ అర్బన్ శాసన సభ్యులు ధన్‌పాల్ సూర్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై, శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ.. వేల సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర, విశిష్ట ఆధ్యాత్మిక ప్రాశస్త్యం కలిగిన పవిత్ర ఖిల్లా రామాలయంలో ఇటువంటి మహత్తర కార్యాన్ని చేపట్టడం ఎంతో సంతోషకరమన్నారు. నగరంలో నలుమూలల నుంచి భక్తులందరికీ స్పష్టంగా వీక్షించే విధంగా 101 అడుగుల అత్యంత ఎత్తైన ధర్మ ధ్వజాన్ని రూపుదిద్దుతున్నట్లు తెలిపారు. ఈ ధ్వజం కేవలం ఒక కేతనం మాత్రమే కాదని, మన పవిత్ర సనాతన ధర్మానికి, దివ్యమైన భారతీయ సంస్కృతి మరియు ఉచ్ఛమైన సంప్రదాయాలకు ప్రతీకగా నిలవనుందని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మిక చింతన, ధర్మ రక్షణ భావనను పెంచేలా ఈ ధ్వజం నిలుస్తుందన్నారు. ఆలయ ఆవరణలో జరిగిన ఈ భూమిపూజ మహోత్సవానికి పెద్ద ఎత్తున భక్తులు, ధర్మాభిమానులు తరలివచ్చారు. దేవుని నామస్మరణలతో ఆలయ ప్రాంగణమంతా మారుమోగింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గురుప్రసాద్, మాజీ చైర్మన్ ముక్కా దేవేందర్ గుప్తా, విశ్వహిందూ పరిషత్, బజరంగ్ దళ్ ప్రతినిధులు, స్థానిక బీజేపీ కార్పొరేటర్లు, వివిధ హిందూ ఆధ్యాత్మిక సంఘాల నాయకులు, భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు. పూజా కార్యక్రమాల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

# చౌట్‌పల్లిలో సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడితే ₹500 జరిమానా

**నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 21(డీడీ9 వార్త) :**

కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లి గ్రామంలో సింగిల్ యూస్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నివారించడమే లక్ష్యంగా గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో శుక్రవారం వారసంత వద్ద ముమ్మర అవగాహన ప్రచారం నిర్వహించారు. పర్యావరణానికి తీవ్ర ముప్పుగా మారిన ప్లాస్టిక్ కవర్లు, వస్తువులను విక్రయించవద్దని, వాడవద్దని దుకాణదారులకు, వినియోగదారులకు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మహబూబ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం గ్రామంలో సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడకంపై పూర్తిస్థాయి నిషేధం అమలులో ఉందన్నారు. నిబంధనలను బేఖాతరు చేస్తూ ఎవరైనా ప్లాస్టిక్ కవర్లు అమ్మినా లేదా వాడినా వారికి రూ.500 జరిమానా విధించబడుతుందని హెచ్చరించారు. గ్రామాన్ని ప్లాస్టిక్ రహితంగా మార్చేందుకు ప్రజలందరూ సహకరించాలని మార్కెట్‌కు వచ్చేటప్పుడు సొంతంగా గుడ్డ సంచులను తెచ్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఉపసర్పంచ్ సట్ట విశాల్, పాలకవర్గ సభ్యులు కాలేవర్ గణేష్, మూద్దుల మురళి, గ్రామ పంచాయతీ సిబ్బంది తాళారీ రాజు తదితరులు పాల్గొన్నారు.

# బోధన్ గిరిజన వసతి గృహంలో నోట్ బుక్కుల పంపిణీ



**బోధన్, నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 21(డీడీ9 వార్త) :**

ప్రభుత్వ వసతి గృహాల్లో చదువుతున్న నిరుపేద గిరిజన విద్యార్థుల చదువుకు ఆటంకం కలగకుండా ప్రభుత్వం తక్షణమే అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించాలని గిరిజన విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం బోధన్‌లోని గిరిజన బాలుర వసతి గృహంలో గిరిజన విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐడీసీఎంఎస్ మాజీ చైర్మన్ బాధవత్ తారాచంద్ నాయక్, నాయకుడు జాదవ్ ప్రవీణ్ నాయక్ ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గత వారం వసతి గృహాన్ని సందర్శించిన సమయంలో విద్యార్థులు పలు సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. ముఖ్యంగా ప్రభుత్వం నుంచి అందాల్సిన నోట్‌బుక్కులు, మ్యాట్లు, దోమతెరల కొరతతో పాటు మెనూ ప్రకారం భోజనం అందించకపోవడం, మరుగుదొడ్లు అపరిశుభ్రంగా ఉండటం వంటి సమస్యలు ఉన్నాయని తెలిపారు. అధికారులు తక్షణమే స్పందించి విద్యార్థులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన సామాగ్రిని సకాలంలో అందించాలని కోరారు. వసతి గృహంలో ప్రతిరోజూ పారిశుధ్య పనులు చేపట్టి, పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన భోజనం అందించాలని వార్డెన్, సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో గిరిజన విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొర్ర బంతిలాల్ నాయక్, ఉపాధ్యక్షులు బర్మవత్ నరేష్ నాయక్, బంజారా యువ నాయకులు మహేష్ నాయక్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# అంకాపూర్‌లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా, ఎమ్మెల్యే రాకేష్ రెడ్డిలతో కలిసి పనుల పరిశీలన
- డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, 'యంగ్ ఇండియా' పాఠశాల నిర్మాణాలపై క్షేత్రస్థాయి సమీక్ష





**నిజామాబాద్ జిల్లా, ఆగస్టు 21(డీడీ9 వార్త)**

ప్రజా సంక్షేమం, భవిష్యత్తు అవసరాల కోసం ప్రభుత్వం చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను వేగవంతం చేసి, త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామంలో శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియాతో కలిసి మంత్రి విస్తృతంగా పర్యటించారు. గ్రామంలో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణ పనులతో పాటు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల' భవన నిర్మాణ పురోగతిని క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు. ఎమ్మెల్యే స్వగ్రామమైన అంకాపూర్‌లో రూపుదిద్దుకుంటున్న ఈ పాఠశాల భవన నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లకు స్పష్టం చేశారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాల్లో ఎక్కడా రాజీ పడకూడదని, పారదర్శకతతో పనులు జరగాలని తేల్చిచెప్పారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ఎదురవుతున్న పలు సమస్యలను ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణంలో మిగిలిపోయిన అర్హులైన పేద లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించాలని, ఆలూరు మండలంలో ఎంఆర్ఓ కార్యాలయ భవన నిర్మాణానికి అలాగే నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరారు. ఎమ్మెల్యే విజ్ఞప్తులపై మంత్రి పొంగులేటి సానుకూలంగా స్పందిస్తూ నియోజకవర్గ పురోగతికి, అడిగిన పనులకు త్వరితగతిన నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియా, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

The imprint line should be printed legibly as Printed by Published by BATHULA KUMARA RAJA on behalf of GARUDA, printes at and published at H.No 2-86/1 PLOT NO. 26-SP, SY NO 420 sager highway, ragannaguda village, abdullapur mandal RANGAREDDY , TELANGANA- 502518